

సాగర్ కుడి కాల్వ



గుంటూరులో ఎల్-1ని తప్పించిన జిన్నింగ్ కోసం ఎంపిక చేసిన ఎల్-3 మిల్లు

చిన్న మిల్లులకు.. పెద్దపీట



గుంటూరులో మిల్లు లోపల ఏర్పాటుచేసిన సీసీఐ కొనుగోలు కేంద్రం ఫ్లెక్సీలు

- సీసీఐ జిన్నింగ్ మిల్లుల ఎంపికపై దుమారం
- కావాల్సినట్లు నిబంధనలను మార్చేశారని విమర్శలు
- తెలంగాణలో ఒక తీరుగా.. ఇక్కడ మరొక రకంగా ప్రక్రియ
- కావాల్సిన మిల్లుల కోసం కొన్నింటిని తప్పించిన అధికారులు
- గుంటూరులో రూ.1199 బిడ్ వేసినా.. కాదని మరొక మిల్లు ఎంపిక

గుంటూరు సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పత్తి జిన్నింగ్‌కు ఒక్కో బేలుకు రూ.1350 చొప్పున మిల్లర్లకు చెల్లిస్తుంది. అందుకు పెద్ద, చిన్న పత్తి మిల్లుల యజమానులు ఒప్పుకుని బిడ్డింగ్ వేశారు. ఈ క్రమంలో ఎక్కువ మిషన్లు కలిగి, అధిక సౌకర్యాలు ఉన్న మిల్లులకు ప్రాధాన్యం ఇవ్వాలి. అయితే నిబంధనలకు విరుద్ధంగా తగిన సామర్థ్యం లేకున్నా.. సౌకర్యాలు లేని చిన్న మిల్లులకు సీసీఐ అధికారులు పెద్దపీట వేశారు. కావాల్సిన వారి మిల్లులను ఎంపిక చేసేందుకు కొందరిని పక్కకు తప్పించారన్న విమర్శలున్నాయి. జిన్నింగ్ మిల్లుల ఎంపికపై దుమారం చెలరేగుతుంది. సీసీఐ కేంద్రాల ఏర్పాటుకు ఆగస్టులో ప్రకటన విడుదల చేశారు. తెలుగు రాష్ట్రంలో ఇంగ్లీషు ప్రకటన వెలువడటం మొదట్లోనే వివాదమైంది. తెలంగాణలో సుమారు 390 మిల్లులను జిన్నింగ్‌కు ఎంపిక చేశారు. ఇక్కడ కేవలం 30 కేంద్రాలనే ఎంపిక చేశారు. గత ఏడాది సుమారు 70 పత్తి మిల్లులను ఎంపిక చేయగా ఈ ఏడాది అందులో సగం కూడా చేయలేదు. మిల్లులు ఎందుకు తగ్గించారో అధికారులు సరిగా వివరణ ఇవ్వలేదు. జిన్నింగ్‌కు ఒక్కో బేలుకు రూ.1350 ఇస్తామని సీసీఐ ఆఫర్ చేసింది. తెలంగాణలో అందరికీ అదే ధర చెల్లిస్తుంది. ఇక్కడ మాత్రం మిల్లర్లు తగ్గింపు ధరకు వేసేలా కొందరు బయ్యర్లు ప్రోత్సహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. జిన్నింగ్ కోసం మిల్లులు ఎంపికలో సామర్థ్యాన్ని బట్టి ఎల్-1, ఎల్-2, ఎల్-3గా విభజించారు. ఎంపికలో మొదటి ప్రాధ్యానం ఎల్-1కే ఇవ్వాలి. అయితే గతంలో ఎన్నడూ లేనివిధంగా వసతులు లేని, కనీసం ఐదు లారీల పత్తి కూడా పట్టని మిల్లులకు పెద్దపీట వేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎంపికలో గోల్‌మాల్ జరిగినట్లు మిల్లుల యజమానులు ఆరోపిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి బిడ్డింగ్ ప్రక్రియ మొదలైన తర్వాత ఆన్‌లైన్‌లో నిబంధనలను పలుమార్లు మార్చినట్లు చెబుతున్నారు. టెండర్లు వేశాక నిబంధనలు మార్చుతూ రావడంలోనే లోపాయకారి వ్యవహారం ఉన్నట్లు అర్థమవుతుందని ఆరోపించారు.

ఎల్-1ను తప్పించి ఎల్-3 ఎంపిక

పేరేచర్ల సెంటర్‌కు గతంలో చాలామంది మిల్లుల యజమానులు పోటీ పడ్డారు. ఈసారి కేవలం ఒకే ఒక బిడ్ పడింది. సీసీఐకి సంబంధించి కొనుగోళ్లలో ముఖ్య పాత్ర పోషించే వ్యక్తి ఇక్కడ కీలకపాత్ర పోషించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గుంటూరు సెంటర్ కోసం ఓ మిల్లు యజమాని రూ.1199కే బిడ్ వేశారు. అయితే నచ్చిన వ్యక్తికి ఇచ్చేందుకు 36 జిన్నింగ్ మిషన్లు కలిగిన పెద్ద మిల్లైన ఎల్-1ను తప్పించి కనీస సౌకర్యాలు లేని ఎల్-3కి ఓ ముఖ్యమైన వ్యక్తి ఆసక్తితో అవకాశం ఇచ్చారు. పుల్లడిగుంట సమీపంలోని సెంటర్ విషయంలోనూ ఇలాగే జరిగింది. గతంలో సీబీఐ కేసులో ఉన్న మిల్లును కూడా ఈసారి ఎంపిక చేశారు. తెలంగాణకు చెందిన కొందరు సీసీఐ కేంద్రాల్లోకి ఎంట్రీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

నిబంధనల ప్రకారమే ఎంపిక

జిన్నింగ్ మిల్లుల ఎంపికలో సీసీఐ ఎక్కడా నిబంధనలను అతిక్రమించలేదు. ఎంపికలో మొదట ఎల్-1 మిల్లులకే ప్రాధాన్యం ఇచ్చాం. ఆన్‌లైన్‌లో నిబంధనలు మార్పులు జరగలేదు. ఇతర శాఖలను పరిగణనలోకి తీసుకునే కేంద్రాలలను ఎంపిక చేశాం.

- అమర్నాథ్‌రెడ్డి, సీసీఐ బీఎం

ఉత్తుత్తి కేంద్రాలే

పత్తి కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా సీసీఐ వ్యవహరిస్తుందన్న ఆరోపణలున్నాయి. ధర లేక రైతులు అల్లాడుతున్నా సీసీఐ మాత్రం కొనుగోలు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తుందన్న విమర్శలున్నాయి. గుంటూరు జిల్లాలో ఐదు పత్తి కేంద్రాలు సోమవారం నుంచి తెరిచినట్లు చెబుతున్నా ఒక్క కిలో పత్తి కూడా కొనుగోలు చేయలేదు. అసలు సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు తెరిచిందన్న సమాచారం రైతులకు తెలియదు. సాధారణంగా మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలను పిలిచి ప్రారంభించాలి. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఏ ఒక్క ప్రజాప్రతినిధికి కూడా సీసీఐ కేంద్రాల ఏర్పాటుపై సమాచారం లేదు. గుంటూరు హౌసింగ్ బోర్డ్ సమీపంలోని కేంద్రం వద్ద కనీసం బోర్డు కూడా ఏర్పాటు చేయలేదంటే అధికారులకు కొనుగోళ్లపై ఏపాటి ఆసక్తి ఉందో తెలుస్తోంది.

వరద పోటెత్తుతుండగా.. జల విద్యుత్ కొనసాగుతూ ఉంది. గతంలో ఎన్నడూ లేనట్లుగా మూడు నెలల నుంచి నాగార్జున సాగర్ జలాశయం నుంచి దిగువకు నీటి విడుదల జరుగుతుండగా కుడి కాల్వ పరిధిలోని జల విద్యుత్ కేంద్రాలు నిరంతరాయంగా పని చేస్తూనే ఉన్నాయి. నిరాటంకంగా విద్యుత్ ఉత్పత్తి జరుగుతూ ఉంది. రాష్ట్రానికి విద్యుత్ వెలుగులు ప్రసరింప చేస్తున్నాయి. సాగు నీటి సరఫరా కుడి కాల్వకు పుష్కలంగా జరుగుతుండగా.. ఆయకట్టు పరిధిలో ఒకవైపు పంటలతో కళకళలాడు తోంది. మరోవైపు విద్యుత్ పెద్దఎత్తున ఉత్పత్తి జరుగుతోంది. రాష్ట్రానికి అవసరమైన విద్యుత్ కొరతను సాగర్ కుడి కాల్వ తీరుస్తోంది. మరో వైపు టెయిల్‌పాండ్ ప్రాజెక్టు నుంచి కూడా భారీగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. కుడికాల్వ.. టెయిల్ పాండ్ ప్రాజెక్టు విద్యుత్‌కు ఖిల్లాగా నిలిచింది. కుడి కాల్వ పరిధిలోని ఆయా కాల్వలపై, కుడిగట్టు విద్యుత్ కేంద్రాల ద్వారా ప్రతిరోజూ 79.25 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది.

వరద.. విద్యుత్

- కుడి కాల్వ జల విద్యుత్ ఖిల్లా
- రోజూ 79.25 మెగా వాట్ల ఉత్పత్తి
- టెయిల్‌పాండ్ నుంచి ఒక మిలియన్..
- విద్యుత్ ఉత్పతిలో కీలకంగా ప్రాజెక్టులు
- 128 లక్ష్యానికి ఇప్పటికే 95.509 ఎంయూ ఉత్పత్తి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కృష్ణానదికి వరద పోటెత్తుతుండగా గతంలో ఎన్నడూ లేనట్లు సాగర్ జలాశయానికి వరద ప్రవాహం ఉంది. నదీ పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలతో సాగర్‌కు వరద వస్తోంది. జూలైలో ప్రారంభమైన వరద ఇప్పటికీ కొనసాగుతోంది. సాగర్ జలాశయం ద్వారా ఆగస్టు మొదటి వారం నుంచి కుడికాల్వకు నీరు విడుదల చేస్తున్నారు. కుడి కాల్వకు 10,160 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో కుడి గట్టు మీద ఉన్న జల విద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పతి జరుగుతోంది. 1983లో రెండు యూనిట్లు, 1990లో ఒక యూనిట్‌ను వినియోగంలోకి తీసుకువచ్చారు. రెండు యూనిట్ల ద్వారా 35 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. మూడో యూనిట్ ద్వారా కూడా విద్యుత్ ఉత్పత్తికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. యూనిట్ ఒకటి ద్వారా 0.422 మిలియన్ యూనిట్లు, రెండో యూనిట్ ద్వారా 0.404 మిలియన్ యూనిట్లు మొత్తంగా 0.826 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేస్తున్నట్లు సంబంధిత అధికారి తెలిపారు. ఈ నెల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం 24 మిలియన్ యూనిట్లు కాగా ఇప్పటికే 23.928 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు. ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తి 128 మిలియన్ యూనిట్ల లక్ష్యం కాగా ఇప్పటి వరకు 95.509 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి జరిగింది. కుడి గట్టు కేంద్రాల ద్వారా జరిగే విద్యుత్ ఉత్పత్తి రాష్ట్రానికి వస్తుంది. మార్చి వరకు విద్యుత్ ఉత్పత్తి కొనసాగుంతుందని అంచనా.

కుడి గట్టు విద్యుత్ కేంద్రంలో ఇలా..


ఒకటో యూనిట్ -	0.422 ఎంయూ
రెండో యూనిట్ -	0.404 ఎంయూ
టెయిల్ పాండులో రెండు ప్లాంట్లు -	1.02 ఎంయూ
27 జల విద్యుత్‌కేంద్రాలు	- 4.25 మెగావాట్లు

కుడి కాల్వపై 27 జల విద్యుత్ కేంద్రాలు

కుడికాల్వ పరిధిలో 27 జలవిద్యుత్ ప్లాంట్లు ఉన్నాయి. వీటి సామర్థ్యం 44.25 మెగావాట్లు కాగా రోజుకు 9.55 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. కుడి కాల్వకు నీటి సరఫరా ఉంటే ఈ ప్లాంట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. గుంటూరు బ్రాంచ్ కెనాల్ పరిధిలో 22.9 మెగా వాట్ల సామర్థ్యం కలిగిన 14 విద్యుత్ ప్లాంట్లు ఉన్నాయి. అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో 8(16.7 మెగా వాట్లు), బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్ పరిధిలో 2.4 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడు, ఒంగోలు బ్రాంచ్ కెనాల్‌పై 1.5 మెగావాట్ల సామర్థ్యంతో ఒకటి, జూలకట్టు బ్రాంచ్ కెనాల్‌పై ఒక మెగావాట్ సామర్థ్యం కలిగిన ఒక ప్లాంట్ ఉంది.

311.75 టీఎంసీల నీటి నిల్వ

సాగర్ జలాశయం నిండుకుండలా ఉంది. నీటి నిల్వ పూర్తి స్థాయికి చేరింది. జలాశయానికి 62,644 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంది. ఇక్కడ నుంచి 69,029 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా సోమవారం 311.75 టీఎంసీల నిల్వ ఉంది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 590 అడుగులు కాగా ప్రస్తుతం 589.9 అడుగులు ఉంది.



సాగర్ జలాశయం



టెయిల్ పాండ్ ప్రాజెక్టు

రివర్సబుల్ టర్బయిన్ల ద్వారా..

సాగర్‌కు దిగువన రెంటచింతల మండలం సత్రశాల సమీపంలో టెయిల్‌పాండ్ ప్రాజెక్టు నిర్మించారు. ఈ ప్రాజెక్టు 2017లో వినియోగంలోకి వచ్చింది. సాగర్ జలాశంలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నప్పుడు జలవిద్యుత్ ద్వారా విడుదల చేసిన నీటిని నిల్వ చేసి మళ్లీ తిరిగి జలాశంయలోకి ఎత్తిపోయడానికి నిర్మించిందే టెయిల్‌పాండ్ ప్రాజెక్టు. దీని నీటి నిల్వ సామర్థ్యం ఆరు టీఎంసీలు. ఈ ప్రాజెక్టులో నీటి నిల్వ బ్యాక్ వాటర్ సాగర్ డ్యామ్ వరకు నిలుస్తుంది. నీటిని రివర్సబుల్ టర్బయిన్ల ద్వారా జలాశయంలోకి ఎత్తిపోస్తారు. నదికి వరద ఉన్న సమయంలో జలవిద్యుత్ ఉత్పత్తి చేయడానికి వీలుగా 25 మెగా వాట్ల సామర్థ్యం కలిగిన రెండు యూనిట్లు ఉన్నాయి. వీటికి 50 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉంది. రెండు ప్లాంట్ల నుంచి రోజూ 1.02 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. వరద నీరు కొనసాగుతుండటంతో ఆగస్టు నుంచి ఇక్కడ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

సాగర్ కుడి కాల్వపై ఉన్న ప్లాంట్





గుంటూరు బ్రాంచ్ కెనాల్‌పై విద్యుత్ ప్లాంట్


మాజీ మంత్రి రజిని పీచేముడ్

- చిలకలూరిపేట ఇన్‌చార్జిగా వెళ్లే యత్నం
- మాజీ మంత్రి అంబటి సత్తెనపల్లి నుంచి పరారీ
- గుంటూరు పశ్చిమ వైపు మేయర్ మనోహర్ చూపు


గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి వ్యతిరేకంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో వీచిన గాలుల్లో ఘోర పరాజయాన్ని చూసిన మాజీ మంత్రులు వచ్చే ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు తగిన నియోజకవర్గాల్ని ఎంచుకునే పనిలో పడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో మంత్రులుగా వ్యవహరించిన విడదల రజిని, అంబటి రాంబాబు గత ఎన్నికల్లో తాము పోటీ చేసిన నియోజకవర్గాలను వీడి వేరే నియోజకవర్గాల ఇన్‌చార్జిలుగా బాధ్యతలు చేపట్టేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. 2019 ఎన్నికల్లో చిలకలూరిపేట నుంచి పోటీ చేసి గెలుపొందిన రజిని మంత్రి పదవిని చేపట్టారు. మంత్రిగా ఉన్న సమయంలో తన వ్యవహారశైలితో సొంత నియోజకవర్గం సొంత పార్టీలో వ్యతిరేకత కూడగట్టుకున్నారు. ఈ క్రమంలో ఓటమి భయంతో 2024 ఎన్నికల్లో గుంటూరు పశ్చిమకు వలస వచ్చారు. ఇక్కడ ఘోర ఓటమితో ఆమె పునరాలోచనలో పడ్డారు. రజిని గుంటూరు పశ్చిమకు వలస రావడంతో చిలకలూరిపేట నుంచి పోటీ చేసే అవకాశం దక్కించుకుని ఓడిపోయిన నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు కూడా వచ్చే ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జిగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. తొలుత చిలకలూరిపేట ఇన్‌చార్జి బాధ్యతలు ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌కు ఇవ్వాలని దసరాకు ముందు జగన్ ఆలోచించారు. అయితే రజినికి తిరిగి చిలకలూరిపేట వెళ్లాలనే ఆలోచన కలగటంతో జగన్ ఆమెను కాదనలేకపోయారు. దీంతో నేడో, రేపో ఆమెకు చిలకలూరిపేట బాధ్యతలు అప్పగించనున్నారు. అదే జరిగితే మర్రికి మరోసారి చుక్కెదురు కానుంది. ఇదిలా ఉండగా గత ఎన్నికల్లో సత్తెనపల్లి నుంచి పోటీ చేసి ఓటమి పాలైన మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇప్పటికే అక్కడ నుంచి పరారై వచ్చేశారు. ఆయనకు గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్ష పదవిని కట్టబెట్టటం ద్వారా పల్నాడు నుంచి ఇక్కడకు వలస తీసుకొచ్చారు. అయితే ఆయన కూడా గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జి బాధ్యతలు ఆశించే అవకాశం ఉంది. లేదా అతడి సోదరుడు అంబటి మురళీ గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన పొన్నూరు బాధ్యతలను రాంబాబుకు అధిష్ఠానం అప్పగించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుంది.



మాజీ మంత్రి రజనీ



మాజీ మంత్రి రాంబాబు



మేయర్ మనోహర్‌నాయుడు



ఓటర్లు.. 17,35,365



- స్వల్పంగా పెరిగిన ఓట్లు
- జిల్లాలో మహిళా ఓటర్లే అధికం
- క్లెయిమ్, అభ్యంతరాల స్వీకారం ప్రారంభం
- వచ్చే నెల 28 వరకు దాఖలుకు అవకాశం

నరసరావుపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): 2025 స్పెషల్ సమ్మరి రివిజన్‌ని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇందులో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాను చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్‌యాదవ్ మంగళవారం సాయంత్రం విడుదల చేశారు. ఆ తర్వాత జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాలను కలెక్టర్ అరుణ్ బాబు విడుదల చేశారు. జిల్లాలో 17,35,365 మంది ఓటర్లగా నమోదై ఉన్నారు. పురుషల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. గతం కంటే ఓటర్ల సంఖ్య సల్పంగా పెరిగింది. 8,46,793 మంది పురుషులు, 8,88,385 మంది మహిళలు, థర్డ్ జండర్ 187 మంది ఉన్నారు. పురుషల కంటే మహిళల ఓట్లు 41,592 అధికంగా ఉన్నాయి. ఓటర్ల జాబితా సవరణకు ముందు గత మార్చిలో 17,20,526 ఓట్లు ఉండగా సవరణ అనంతరం 17,35,365 ఓటర్ల సంఖ్య పెరిగింది. ఏడు నెలల వ్యవధిలో 14,839 ఓట్లు పెరిగాయి. జిల్లాలో 23,26,704మంది జనాభా ఉండగా ఓటర్లుగా 17,35,365 మంది ఉన్నారు. ఓటర్ల నిష్పత్తి సుమారు 745గా నమోదైంది. వెయ్యి జనాభాకు సగటున 724 ఓటర్లు ఉండాలని ఎన్నికల కమిషన్ ప్రకటించగా జిల్లాలో అధికంగా ఉంది. ఇక నియోజకవర్గాలవారీగా ఓటర్ల సంఖ్య చూస్తే అత్యధికంగా గురజాల, అత్యల్పంగా పెదకూరపాడు నమోదైంది.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్ జండర్	మొత్తం
పెదకూరపాడు	1,13,202	1,18,878	15	2,32,095
చిలకలూరిపేట	1,08,395	1,18,180	47	2,26,622
నరసరావుపేట	1,13,139	1,19,607	30	2,32,776
సత్తెనపల్లి	1,18,445	1,23,661	12	2,42,118
వినుకొండ	1,31,353	1,33,504	20	2,64,877
గురజాల	1,33,488	1,40,716	42	2,74,246
మాచర్ల	1,28,771	1,33,839	21	2,62,631

జనవరి 6న తుది ఓటర్ల జాబితా..

కేంద్ర ఎన్నికల సంఘం ఏటా ఓటరు జాబితాలను స్వచ్ఛీకరణకు స్పెషల్ సమ్మరి రివిజన్ ప్రక్రియ చేపడుతున్న విషయం తెలి సిందే. ఈ నేపథ్యంలో ఎస్ఎస్ఆర్-2025 షెడ్యూల్‌ని ఇదివరకే ప్రక టించింది. కాగా మంగళవారం ముసా యిదా జాబితాని విడుదల చేసి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీ కరించడం ప్రారంభిం చిం ది. వచ్చే నెల 28 వరకు క్లెయిమ్‌లు, అభ్యంత రాలు తీసుకుని డిసెంబరు 24వ తేదీ లోపు వాటిని పరిష్క రిస్తుంది. 2025 జనవరి ఒకటో తేదీన ఓటరు జాబితాలు సక్రమంగా ఉన్నాయో, లేదో సరి చూసుకుని జనవరి 6న తుది ఓటర్ల జాబితాల ను ప్రచురిస్తుంది. ఓటర్లలో చైతన్యం నింపేందుకు నవంబరు 9, 10, 23, 24 తేదీల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను నిర్వహించనున్నది. ఆయా తేదీల్లో బూత్ స్థాయి అధికారులను పోలింగ్ బూత్‌ల వద్ద అందుబాటులో ఉండేలా చూసి అప్పటికప్పుడు క్లెయిమ్‌లు, అభ్యంతరాల ఫారంలను పెట్టిస్తుంది.

జనవరి 1కి 18 ఏళ్లు నిండితే ఓటరుగా నమోదు కావాలి

2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్ల వయస్సు వచ్చే ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని ఎన్నికల సంఘం విజ్ఞప్తి చేసింది. అలానే జూలై ఒకటో తేదీ, అక్టోబరు ఒకటో తేదీకి 18 ఏళ్ల వయస్సు వచ్చే వారు కూడా ఓటరుగా నమోదయ్యేందుకు అర్హులని జిల్లా యంత్రాం గం స్పష్టం చేసింది. గతం లో ఓటరుగా నమోదు కానివారు కూడా ఫారం-6లను అందజేయాలని సూచించింది. ప్రస్తుతం ఓటర్లుగా నమోదై ఉన్న వారు తమ ఆధార్‌ని ఫారం-6బీలో అందజేయాలని కోరింది. వోటర్స్.ఈసీఐ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్/ఓటర్ హెల్ప్ లైన్ మొబైల్‌యాప్‌లో కూడా ఆయా ఫారంలు అందజేయవచ్చని పేర్కొన్నది.

రూ. 69 కోట్లు వృథా

- లక్ష్యం నెరవేరని భూగర్భ డ్రెయినేజి పథకం
- నరసరావుపేటలో తీరని మురుగు నీటి సమస్య

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రూ.69కోట్లు కుమ్మరించి నరసరావుపేటలో భూగర్భ డ్రెయినేజ్ పథకాన్ని నిర్మించి వినియోగించడాన్ని విస్మరించారు. నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఈ పథకం ఉన్నా మురుగునీటి సమస్యలు పట్టణ ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. దీనిని ప్రారంభించి ఐదేళ్లు గడచినా అరకొరగానే వినియోగిస్తున్నారు. పూర్తి స్థాయిలో సద్వినియోగపరిచేందుకు పురపాలక సంఘం ప్రయత్నించడంలేదు. భూగర్భ డ్రెయినేజ్ పథకం అమల్లోకి వస్తే మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, దోమల బెడద తీరుతుందని భావించిన ప్రజలు దీని నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతి గృహానికి మురుగు నీటి కనెక్షన్ ఇవ్వడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారు. పట్టణ పరిధిలోని ఇళ్లు, జనాభా సంఖ్య ఆధారంగా నిత్యం 18 ఎంఎల్‌డీ మురుగునీరు వస్తుందన్న అంచనాతో మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను నిర్మించారు. అయితే రోజూ 5 ఎంఎల్‌డీ మాత్రమే వస్తున్నట్లు అంచనా. దీంతో 30 శాతం మాత్రమే పథకం అమలవుతున్నది. పథకం నిర్వహణలో నిర్లక్ష్యం తాండవిస్తుండటంతో కొందరు గృహాలకు ఇచ్చిన కనెక్షన్లను తొలగించేశారు. మున్సిపాల్టీలో 24,910 గృహాలు ఉన్నట్లు ఇటీవల జరిగిన సర్వేలో గుర్తించారు. 19576 అసెస్‌మెంట్లలో ఖాళీ స్థలాలు 315, అపార్ట్‌మెంట్లు, ఇతర గ్రూప్ ఇళ్లు 213 ఉన్నాయి. 16,493 అసెస్‌మెంట్లకు సరిపడా మాత్రమే అండర్ గ్రౌండ్ డ్రెయినేజ్ పైపులైను నిర్మించారు. ఇంకా 3083 అసెస్‌మెంట్లకు కనెక్షన్ల కోసం పైపులైన్ నిర్మించాల్సి ఉంది. 12,000 గృహాలకు మురుగు నీటి కనెక్షన్లు ఇచ్చారు. ఇంకా 4,493 గృహాలకు కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. నూరు శాతం గృహాలకు కనెక్షన్లు ఇవ్వక పోవడంతో పట్టణంలోని చాలాప్రాంతాల్లో గృహాల్లోని మురుగునీరు కాల్వల్లోకి ప్రవహిస్తున్నది. యూజీడీ అమల్లో ఉండగా మురుగు కాల్వలు నిర్మించడాన్ని ప్రభుత్వం నిషేధించింది. పథకం పూర్తిగా అమల్లోకి తీసుకురాకుండా మురుగుకాల్వలను నిబంధనలకు విర్ధుంగా మున్సిపాల్టీ నిర్మిస్తున్నది.



మురుగు నీటి శుద్ధి ప్లాంట్

దుర్గంధం.. దోమలు

మురుగునీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా ఉండటంతో పట్టణంలో దోమల బెడద రోజురోజుకు అధికమవుతున్నది. దోమ కాటుకు గురై ప్రజలు జ్వరాల భారిన పడుతున్నారు. వివిధ ప్రాంతాల్లో కాల్వలు పూడిపోయి మురుగునీరు పారుదల లేక దుర్గంధం వెదజల్లుతున్నది. మురుగు నీటి కనెక్షన్లు పూర్తి స్థాయిలో అమలు చేస్తే పట్టణంలో మురుగు నీటి సమస్య పరిష్కారంతో పాటు దోమల బెడదను పూర్తిగా అరికట్టవచ్చు.

రైలులో ప్రయాణిస్తున్న బాలుర పట్టివేత

పిడుగురాళ్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): హౌరా నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఫలక్‌నామా ఎక్స్‌ప్రెస్‌లో మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా స్పెషల్ డ్రైవ్‌ను మంగళవారం రైల్వే సీఐ కె.ఏడుకొండలు, రాష్ట్ర సమన్వయ కర్త జి. తిరుపతిరావు సిబ్బందితో కలిసి పిడుగురాళ్ల, గుంటూరు మధ్య రైల్వే తనిఖీలు నిర్వహించగా మొత్తం ఆరుగురు బాలురు నల్గొండ - సికింద్రాబాద్ మధ్య టిక్కెట్ లేకుండా ప్రయాణిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వారంతా కూలి పనులకు వెళ్తున్నట్లు అనుమానిస్తూ ప్రత్యేక బృందం వారిని పిడుగురాళ్ల రైల్వే పోలీస్‌స్టేషన్‌కు తీసుకుచ్చారు. రైల్వే సిబ్బంది, నీడ్స్ సంస్థ విచారణ చేయగా ముగ్గురు అనుమానిత వ్యక్తులతో కలిసి కూలి పనులకు వెళ్తున్నారని రైల్వే పోలీసులు గుర్తించి సంరక్షణ, రక్షణ కోసం జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు సమాచారం అందిస్తున్నట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	128, 138,148
చికెన్ విత్ స్కిన్	240.00
చికెన్ స్కిన్ లెస్	250.00

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 50,944 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద 44,274 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుండగా 16వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా విడుదల అవుతున్నాయి.

41,651 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 43,346 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 41,651 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 30,279 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	16000	334	8000	14500
నెంబరు. 5	8500	13000	నెంబరు. 5	--	--
273	10000	16000	273	12000	12500
341	9000	15000	341	10000	15700
4884	10000	11500	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18200	తేజ	10500	18500
బ్యాడిగి	8500	14000	బ్యాడిగి	9000	14000
దేవనూరు డీలక్స్	8500	13500	దేవనూరు డీలక్స్	9000	13500
తెల్లకాయలు	5000	12000	తెల్లకాయలు	5000	11000

సింగపూర్ వెళ్లాలి బెయిల్ షరతులు సడలించండి

- పాస్‌పోర్టు కూడా తిరిగి ఇప్పించండి
- హైకోర్టులో వైసీపీ నేత పిన్నెల్లి పిటిషన్
- ఆయనకు నేర చరిత్ర ఉంది.. పారిపోతారు
- విచారణలో బెయిల్ రద్దు పిటిషన్: పోలీసులు
- 4న నిర్ణయం వెల్లడిస్తామన్న న్యాయమూర్తి

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నమోదైన కేసుల్లో బెయిల్ మంజూరు సందర్భంగా విధించిన షరతులను సడలించాలని కోరుతూ మాచర్ల మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తన కుమారుడు చదువు నిమిత్తం సింగపూర్‌కు వెళ్తున్నాడని, ఈ నేపథ్యంలో తండ్రిగా ఆయన వెంట వెళ్లి, ఆ దేశంలో ఏర్పాట్లు చేయాల్సి ఉందని వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్‌లలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తాను సింగపూర్‌కు వెళ్లేందుకు అనుమతించాలని విన్నవించారు. ఈ పిటిషన్‌కు సంబంధించి ఇటు పిన్నెల్లి, అటు పోలీసుల తరఫున వాదనలు మంగళవారం ముగియడంతో న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ నవంబరు 4న నిర్ణయం వెల్లడిస్తామని ప్రకటించారు.

పిన్నెల్లి వాదనలు ఇవీ..

ఎన్నికల సందర్భంగా సృష్టించిన విధ్వంసాలకు సంబంధించి తనపై నమోదైన కేసులలో హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ ఇచ్చిందని పిన్నెల్లి తరఫు న్యాయవాది రామలక్ష్మణరెడ్డి కోర్టుకు తెలిపారు. అయితే, ఇప్పుడు పిటిషనర్ తన కుమారుడి కోసం సింగపూర్ వెళ్లాల్సి ఉన్నందున ఈ షరతులలో రెండింటిని సడలించాలని విన్నవించారు. సింగపూర్ వెళ్లేందుకు వీలుగా మేజిస్ట్రేట్ వద్ద సరెండర్ చేసిన పాస్‌పోర్టును తిరిగి ఇప్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కోర్టు ఆదేశాల మేరకు ప్రతివారం దర్యాప్తు అధికారి ముందు హాజరవుతున్నట్టు తెలిపారు. ఈ షరతును కూడా సడలించాలని కోరారు. దర్యాప్తు అధికారి కోరినప్పుడు విచారణకు హాజరయ్యేందుకు పిటిషనర్ సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

సడలించొద్దు: పోలీసులు

పోలీసుల తరఫు న్యాయవాది స్పందిస్తూ.. "పిటిషనర్ (పిన్నెల్లి)కు నేరచరిత్ర ఉంది. ఇవే కేసుల్లో నిందితుడిగా ఉన్న పిటిషనర్ సోదరుడు(వెంకట్రామిరెడ్డి) విదేశాలకు పారిపోయారు. నోటీసు ఇచ్చేందుకు కూడా అందుబాటులో లేరు. పిన్నెల్లి బెయిల్ రద్దు చేయాలని కోరుతూ ప్రాసిక్యూషన్ హైకోర్టులో పిటిషన్ వేసింది. ప్రస్తుతం దానిపై విచారణ పెండింగ్‌లో ఉంది. సోదరుడి వద్దకు వెళ్లేందుకే పిటిషనర్ పాసుపోర్ట్ ఇప్పించాలని కోరుతున్నారు. దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని విధించిన షరతు సడలించవద్దు" అని కోర్టుకు విన్నవించారు. ఇరుపక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. విదేశాలకు వెళ్లేందుకు ట్రయల్ కోర్టు అనుమతించాల్సి ఉంటుందన్నారు. దీనికి సంబంధించి నిర్ణీత సమయంలో నిర్ణయం తీసుకోవాలని విచారణ కోర్టుకు తగిన ఆదేశాలు ఇస్తామని తెలిపారు.

అసలు ఏం జరిగింది?

ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మాచర్ల నియోజకవర్గంలోని పాల్వాయిగేటు పోలింగ్ బూత్‌లో వైసీపీ అభ్యర్థి, అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విధ్వంసం సృష్టించారు. పోలింగ్ కేంద్రంలో ఈవీఎం, వీవీప్యాట్‌లను ధ్వంసం చేశారు. దీనిని అడ్డుకోబోయిన టీడీపీ ఏజెంట్ శేషగిరిరావుపై దాడి చేశారు. కేంద్రం నుంచి బయటకు వస్తూ.. నాగశిరోమణి అనే మహిళను దూషించారు. ఈ ఘటనలకు సంబంధించి ఎన్నికల సంఘం ఆదేశాలతో పల్నాడుజిల్లా రెంటచింతల పోలీసులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మరో 15 మంది ఆయన అనుచరులపై హత్యాయత్నం(ఐపీసీ 307) మరికొన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మరుసటి రోజు మే14న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి, వీరి అనుచరులు కారంపూడిలో దాడులకు పాల్పడ్డారు. ఈ దాడులను అడ్డుకోబోయిన అప్పటి సీఐ నారాయణస్వామిపై దాడి చేసి గాయపరిచారు. సీఐ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కొన్నాళ్లు రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయనకు హైకోర్టు అప్పట్లో షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఇక, ఈ కేసులలో నిందితుడిగా ఉన్న పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పరారీలో ఉన్నారు.

పంచారామాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో పంచారామాల దర్శనం కోసం ఆర్టీసీ ఏర్పాటు చేసిన ప్రత్యేక సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజారవాణాధికారి ఎమ్.రవికాంత్ తెలిపారు. గుంటూరు-1 డిపో ట్రాఫిక్ విభాగంలో మంగళవారం జరిగిన సమావేశంలో డిపో మేనేజర్ ఎమ్‌వీఎస్ రామకృష్ణతో కలిసి బస్సులు బయల్దేరు వివరాలు, ఛార్జీలతో కూడిన కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ శని, ఆదివారం రాత్రి బయల్దేరి తిరిగి మరుసటి రోజు రాత్రి సమయానికి గుంటూరు చేరుకునేలా సర్వీసులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పంచారామాలైన సామర్లకోట, అమరావతి, పాలకొల్లు, ద్రాక్షారామం, భీమవరంతో పాటు త్రిశైవ క్షేత్రాలైన యాగంటి, మహానంది, శ్రీశైలం క్షేత్రాలను దర్శించుకునేలా బస్సులను సిద్ధం చేశామన్నారు. రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పించినట్లు తెలిపారు. ఆఫీస్ సూపరింటెండెంట్ వి.బాలునాయక్, ట్రాఫిక్ ఇన్‌ఛార్జి డీజీ నాయక్ తదితరులున్నారు.

వర్సిటీ దూర విద్యలో ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రాం

● దూర విద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు వెల్లడి



అనుమతి పత్రాలను విడుదల చేస్తున్న వీసీ ఆచార్య గంగాధరరావు, దూరవిద్య డైరెక్టర్ వెంకటేశ్వర్లు

పెదకాకాని, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ 2024-25 విద్యా సంవత్సరానికి దూర విద్యా విధానంలో మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు దూర విద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు మంగళవారం వెల్లడించారు. ఈ మేరకు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ), డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (డెబ్) నుంచి నూతనంగా అనుమతి లభించినట్లు చెప్పారు. ఏపీ ఐసెట్-2024 లేదా ఏఎన్‌యూ, సీడీఈ నిర్వహించే టెస్ట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు అన్నారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల వ్యవధి రెండేళ్లు ఉంటుందని, మొత్తం నాలుగు సెమిస్టర్లు ఉంటాయని చెప్పారు. ఈ కోర్సుల్లో ప్రవేశాలకు త్వరలో నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. నవంబరు 15వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని ఆచార్య వెంకటేశ్వర్లు వివరించారు. ఈ సందర్భంగా డెబ్‌కు వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, దూర విద్య కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఫైనాన్స్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, దూర విద్య కేంద్రం సూపరింటెండెంట్ నేలపాటి నాగేశ్వరరావు, వై.రాధాకృష్ణ, అకడమిక్ కౌన్సిలర్ డాక్టర్ వి.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన శ్మశానం.. అంత్యక్రియలకు ఇబ్బంది



మృతదేహాన్ని నీళ్లల్లో శ్మశాన వాటికకు తరలింపు

కర్లపాలెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్లపాలెం పంచాయతీ పరిధిలోని దాస్‌నగర్‌లో ఒక వ్యక్తి మృతి చెందగా మంగళవారం అతని మృతదేహాన్ని శ్మశాన వాటికలో పూడ్చి పెట్టి అంత్యక్రియలు నిర్వహించేందుకు మృతుని బంధువులు నానాఅవస్థలు పడ్డారు. మృతదేహాన్ని సంప్రదాయబద్ధంగా శ్మశాన వాటికలో పూడ్చిపెట్టడానికి గోతిని తీయగా నీరు వస్తుంది. శ్మశాన వాటిక మొత్తం వర్షపు నీటితో నిండి ఉండటమే దీనికి కారణం. దీంతో మృతదేహాన్ని పూడ్చి పెట్టేందుకు మృతుని బంధువులు నానా ఇబ్బందులు పడ్డారు. మనిషి చనిపోయిన తరువాత ప్రశాంతంగా, శాస్త్రబద్ధంగా కార్యక్రమాలు నిర్వహించుకోలేని పరిస్థితి. అధికారులు, ప్రజాప్రతినిధులు శ్మశాన వాటికలోని నీటిని బయటకు తరలించి, శ్మశానాన్ని అభివృద్ధి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

పిడుగురాళ్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ మోహన్ తెలిపిన వివరాల ప్రకారం ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో రోడ్డు మార్జిన్‌లో నడుచుకుంటూ వెళ్తున్న బత్తుల నాగరాజును గుంటూరు నుంచి మాచర్ల వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయమై నాగరాజు మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆస్తి కోసం తండ్రిని కడతేర్చిన కుమారుడు

● మద్యం మత్తులో మంచం కోడుతో దాడి

ప్రత్తిపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం తండ్రితో గొడవపడి.. ఆపై మంచం కోడుతో కొట్టి తండ్రిని చంపిన సంఘటన మండల పరిధిలోని చినకోండ్రుపాడులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చినకోండ్రుపాడు పంచాయతీలో ఎలక్ట్రీషియన్‌గా పని చేసే తోకల వెంకట్రామయ్య (62)కు ఇద్దరు భార్యలు. మొదటి భార్యకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మొదటి భార్య కుమారుడు వెంకట కృష్ణ వివాహం జరిగిన నాటి నుంచి పొన్నూరు మండలం కొండబలివారిపాలెంలో నివాసం ఉంటున్నాడు. రెండో భార్యకు పిల్లలు లేరు. అయితే కొంతకాలంగా వెంకట కృష్ణ ఆస్తి కోసం చినకోండ్రుపాడు వచ్చి తండ్రితో తరచూ గొడవ పడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఫుల్‌గా మద్యం తాగిన వెంకట కృష్ణ తండ్రి ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో తండ్రి ఇంట్లో లేకపోవడంతో ఇంటి తాళాలు పగలగొట్టి లోపలకు వెళ్లాడు. ఆ తరువాత ఇంటికి వచ్చిన తండ్రి వెంకట్రామయ్యతో గొడవ పడ్డాడు.మంచం కోడుతో తలపై బలంగా కొట్టాడు. తలకు బలమైన దెబ్బ తగలడంతో బాగా రక్తం పోయింది. వెంటనే ఆయన్ను కేఎంసీ వైద్యశాలకు తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు చెప్పారు. సంఘటనా స్థలాన్ని ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ నాగేంద్ర పరిశీలించారు. వెంకటకృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు

బాధ్యతలు చేపట్టిన డాక్టర్ రమణ యశస్వి



డాక్టర్ రమణ యశస్విని అభినందిస్తున్న ఉద్యోగులు

గుంటూరు మెడికల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ వైద్య బోధన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రమణ యశస్వి మంగళవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ యేకుల కిరణ్ కుమార్ నుంచి ఆయన సూపరింటెండెంట్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు, నర్సులు, మినిస్టీరియల్, ఫోర్త్‌క్లాస్ ఉద్యోగులు నూతన సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వికి అభినందనలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ జీజీహెచ్ బ్రాంచ్ శాఖ ప్రధాన కార్యదర్శి వడ్డె బాలయ్య ఆధ్వర్యంలో తమ పెండింగ్ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఫోర్త్‌క్లాస్ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. జనసేన జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల హరి డాక్టర్ రమణ యశస్విని అభినందించారు.

దోషికి శిక్ష పడాలన్నదే లక్ష్యం

● డీడీ ఎండీ బర్కత్ అలీ ఖాన్





గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నేరం చేసిన వ్యక్తి ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకోరాదు. దోషికి శిక్ష పడాలి. నిరపరాధిపై తప్పుడు అభియోగాలు వీగిపోవాలి. ఇదే లక్ష్యంతో విధులు నిర్వహిస్తున్నామని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఎండీ బర్కత్ అలీ ఖాన్ తెలిపారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు ప్రాసిక్యూషన్ డీడీగా వ్యవహరిస్తున్న ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

నేరస్తులు తప్పించుకోకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

డీడీ: చట్టాలపై దర్యాప్తు అధికారులకు సంపూర్ణ అవగాహన ఉండటం లేదు. దీనివలన ఇన్వెస్టిగేషన్ సరిగా చేయలేక ప్రాసిక్యూషన్ సమయంలో నేరాభియోగాలను నిరూపించలేకపోతున్నారు. ఇందుకు తమ శాఖ పరంగా చట్టాలపై అవగాహన కలిగిస్తూ ఇన్వెస్టిగేషన్ అధికారులకు సలహాలు, సూచనలు ఇస్తున్నాం.

కొత్త చట్టాలపై అవగాహన పరిస్థితి ఏమిటి?

డీడీ: ఇన్వెస్టిగేషన్ అధికారులకు శిక్షణ శిబిరాల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించాం. మూడు జిల్లాల్లోని అధికారులకు విడతల వారీగా శిక్షణ ఇచ్చి 2024 జూలై ఒకటో తేదీ తర్వాత జరిగిన నేరాలపై కొత్త చట్టాలు, అంతకుముందు జరిగిన వాటిపై పాత చట్టాలతో దర్యాప్తు జరిపేలా చర్యలు తీసుకోమని చెబుతాం.

సలహాల కోసం ఎవరెవరు వస్తుంటారు?

డీడీ: మూడు జిల్లాల పోలీసు అధికారులే కాకుండా జిల్లాల కలెక్టర్లు కూడా వారి సిబ్బందిని పంపిస్తుంటారు. ఇటీవలే గుంటూరు జిల్లా కలెక్టర్ ఒక లోకాయుక్తా కేసుకు సంబంధించి న్యాయసలహా కోసం సంబంధిత అధికారిని పంపిస్తే గైడ్ చేశారు.

కోర్టుల్లో కేసులు వీగిపోవడానికి కారణం ఏమిటి?

డీడీ: ఇన్వెస్టిగేషన్ అధికారి, ప్రాసిక్యూషన్‌కు మధ్యన సమన్వయం లోపించింది. దీనివలన కేసుని సరిగా బిల్డ్ చేయలేకపోతున్నారు. ఇది కూడా నేర నిరూపణ కాకపోవడానికి ఒక కారణం. వృత్తిపరంగా లోపాలు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. చట్టం ఎలా ఉందో దాని ప్రకారమే అమలు జరగాలి. ఇన్వెస్టిగేషన్ సరైన దిశగా కొనసాగితేనే కేసులో బలం ఉంటుందని చెప్పి అందుకు ఎక్కడెక్కడ లోపాలు జరుగుతున్నాయో వారికి వివరించి సరిదిద్దుకోమని చెబుతున్నాం.

సాగర్ ప్రాజెక్ట్ 2 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు మంగళవారం 2 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. 2 గేట్లను 6 అడుగులు మేర ఎత్తి 19,880 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా నాగార్జున సాగర్ నీటి మట్టం 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,120 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7110 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,476 క్యూసెక్కులు, 2 క్రస్ట్‌గేట్ల ద్వారా 19,880 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 69,386 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 69,386 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

1.0263 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0263 ఎంయూల విద్యుత్‌ను తయారు చేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ కె.వెంకటరమణ చెప్పారు. ప్రాజెక్టుకున్న 4 రేడియల్ క్రస్ట్‌గేట్లను 2 మీటర్ల మేర ఎత్తి 39,396 క్యూసెక్కులు, టెయిల్‌రేస్ ఛానల్ ద్వారా 8,709 మొత్తంగా 48,105 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 75.46 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.053 టీఎంసీలకు సమానమన్నారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

బాణసంచా దుకాణాలకు అనుమతి తప్పనిసరి

● సీఐ శ్రీనివాసరావు

కారంపూడి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో బాణసంచా విక్రయాల దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని సీఐ టీవీ శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యాపారులు తప్పనిసరిగా అనుమతులు పొందాలని సీఐ శ్రీనివాసరావు సూచించారు.

● దుర్గి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో, నిత్యం జనం రద్దీ ఉండే ప్రాంతాల్లో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయవద్దని ఎస్‌ఐ సుధీర్‌కుమార్ అన్నారు.

పత్రికా ప్రకటన

మా క్లయింట్లు అయిన 1. శ్రీమతి ముక్కమళ్ల రామలక్ష్మమ్మ భర్త రాధాక్రిష్ణారెడ్డి, 2. గణపా చంద్రశేఖరరెడ్డి తండ్రి నాగిరెడ్డి, మునుగోడు గ్రామము, అమరావతి మండలము, పల్నాడు జిల్లా వారి సంజాయిషీ పొంది తెలియచేయునది ఏమనగా!

అమరావతి మండలము, మునుగోడు గ్రామ సర్వే నెంబరు 283లోని య. 18.33 సెంట్ల భూమిపై మా క్లయింట్లనకు వారసత్వ హక్కులు గలవని, సదరు భూమిపై మునుగోడు గ్రామ వాస్తవ్యుడు గణపా రామచంద్రారెడ్డి తండ్రి నాగిరెడ్డి తనకు మాత్రమే హక్కు భుక్తములు గలవని, తప్పుడు పత్రములు సృష్టించి సదరు భూమిని పరులకు విక్రయించుటకు మరియు అన్యాక్రాంతములు చేయుటకు ప్రయత్నించుచున్నాడని తెలియవచ్చినది. ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునగా ఏమనగా ! మా క్లయింట్లకు వారసత్వ హక్కులు గల భూమిపై సదరు గణపా రామచంద్రా రెడ్డి చేయబోవు అన్యాక్రాంతములకు మా క్లయింటునకు ఎటువంటి భాధ్యత లేదని మరియు చెల్లనేరవని, సదరు లావాదేవీలు జరుపు వ్యక్తులు తమ యొక్క స్వంత భాధ్యతకు లోనగుదురు అనియూ మరియు సదరు భూమి కోర్టు వివాదములలో ఉన్నదని తెలియ పరచడమైనది.

ఇట్లు : ముక్కమళ్ల రామాస్వామి రెడ్డి BA, BL
న్యాయవాది, అమరావతి.
సెల్ : 8501020707
ది.29-10-2024

ప్రతి అర్జీ దారుడి సమస్యను పరిష్కరిస్తాం

● ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ
● సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ముప్పాళ్ళ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ పెట్టిన ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారా యణ అన్నారు. ముప్పాళ్ళలో మంగళవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల వద్ద నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఐదు సంవత్సరాల పాటు ప్రజల సమస్యలను గాలికి వదిలి వేసి ప్రజా ఆస్తులను కొల్లగొట్టే కార్యక్రమాలను జగన్మోహన్ రెడ్డి, ఆయన బృందం చేపట్టారన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, గోగినేని కోటేశ్వరరావు, శిరిగిరి గోపాలరావు, రావిపాటి మధుబాబు, దరువూరి నాగేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు అత్తోట కృష్ణ, తెల్లజర్ల వెంకటేశ్వర్లు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.


సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

అర్హులందరూ ఓటర్లుగా నమోదు కావాలి

సత్తెనపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : అర్హులందరూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు కావాలని ఎమ్మెల్యే కన్నా అన్నారు. పట్టణంలోని హోలీ ఫ్యామిలీ ఇంగ్లిషు మీడియం స్కూల్ ఆవరణలో మంగళవారం పట్టభద్రుల ఓటు నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులు, మేధావులు ప్రతిఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటు నమోదు ఫారాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కట్టా శంకరరావు, నూర్‌బాషా, జానీబాబు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా సీఎం సహాయ నిధి

బాధితులకు అండగా సీఎం సహాయనిధి ఉంటుందని కన్నా అన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో మంగళవారం పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా రాజుపాలెం మండలం, నెమలిపురికి చెందిన కే బ్రహ్మేశ్వరరావుకు రూ.10 లక్షలు, టీ నరసింహారావుకు రూ.2,00869 చెక్కులను ఆయన అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లపాటి పెద్దిరాజు, బత్తుల నాగేశ్వరరావు, పూజల వెంకట కోటయ్య, గోగినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

సీఎం సహాయ నిధి పొందిన వారు ఆరోగ్యంగా ఉండాలి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ధి పొందిన వారు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని కోరుకుంటున్నానని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని పెదకూరపాడు క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 27 మందికి రూ.22,72,539 సీఎం సహాయ నిధి చెక్కులను మంగళ వారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యం కోసం సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయాన్ని అందిస్తూ ఆ పేద కుటుంబాలకు చంద్రబాబు భరోసాగా నిలిచారన్నారు. కష్టసమ యాల్లో ప్రతి కుటుంబానికి పెద్ద కొడుకు బాధ్యతను నిర్వహిస్తానని, ఇచ్చిన హామీ ప్రకారం అనారోగ్యం భారిన పడిన వారికి అండగా నిలుస్తూ వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, మండల టీడీపీ నాయకులు మాదినేని వెంకట సుబ్బయ్య, నెల్లూరి మల్లిఖార్జునరావు, టీడీపీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్, అర్తిమళ్ళ వెంకటేశ్వర్లు, పెదకూరపాడు గ్రామ టీడీపీ అధ్యక్షుడు చెన్నుపాటి బుల్లిబాబు, పాటిబండ్ల శివయ్య, కొండవీటి ప్రసాదు తదితరులు ఉన్నారు.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

ప్రతి కుటుంబంలో దీపావళి వెలుగులు

● ఉచిత గ్యాస్ పంపిణీ పథకం ఆరంభం
● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



పిడుగురాళ్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచే ఉచిత గ్యాస్ బుకింగ్ చేస్తున్నారని, మొదటి సిలిండర్ మార్చి నెలాఖరులోపు తీసుకున్న వారందరికీ గ్యాస్ ధర ఖాతాలో జమచేస్తారన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు మహిళల సంక్షేమానికి, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచేం దుకు గతంలోనే పొదుపు సంఘాలు, గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారని, ఇప్పుడు మరలా ఏడాదికి మూడు సిలిండర్లు అందజేస్తారని అన్నారు.

టీడీపీ సభ్యత్వం వేగవంతం చేయండి

టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్ర మాన్ని వేగవంతం చేయాలని ఎమ్మెల్యే యరపతినేని పార్టీ నేతలకు సూచించారు. మంగళవారం పలు మండలాల పార్టీ నాయకులతో ఫోన్‌లో మాట్లాడారు. గతంలో మాదిరిగానే సభ్యత్వ నమోదు రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో ఉండేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.

సవరణ

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, వారు ది. 11-09-2024న ప్రచురించిన యరమాల నాగమల్లేశ్వరి గారి యాడ్‌లో పొరపాటున బ్రాంచ్ పేరు సత్తెనపల్లి అని తప్పుగా పడినది దీనిని పిడుగురాళ్ల బ్రాంచ్ గా చదువుకొనగలరు. డాక్యుమెంట్ నెంబర్ : 15432/2024

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ, న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914.

యమ్మాజీగూడెంలో టీడీపీ సభ్యత్వ నమోదు

బెల్లంకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యమ్మాజీగూడెం గ్రామంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించినట్టు టీడీపీ సీనియర్ నాయకుడు, గ్రామ మాజీ సర్పంచ్ ఇక్కుర్తి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు యమ్మాజీగూడెంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ముందుగా పది మంది సభ్యత్వాలు నమోదు చేశామని తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించుకోవాలని సూచించారు.

శరవేగంగా టీడీపీ సభ్యత్వ నమోదు

దుర్గి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులేశునిపల్లెలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో శరవేగంగా జరుగుతోంది. కార్యక్రమంలో ఉన్న మహేష్, మాగులూరి శ్రీనివాసరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రం ఏర్పాటు

మాచర్లటౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీబిటీయూ కార్యాలయంలో మంగళవారం కృష్ణ, గుంటూరు పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రం కార్యాలయాన్ని ప్రారంభించారు. 2021 సెప్టెంబరు 30వ తేదీ లోపు డిగ్రీ పూర్తి చేసిన వారు ఎమ్మెల్సీ ఓటుకు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9703411948, 9390012049లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మహేష్, ఆదినారాయణ, ప్రవీణ్ కుమార్, రోహిత్, ఆనంద్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ముప్పాళ్ల మండలంలోని తురకపాలెం విశ్రాంత ఉపాధ్యాయుడు బెల్లంకొండ తోమాసయ్య ఈనెల 28వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలసి రాజధాని నిర్మాణం కోసం రూ.లక్ష చెక్కును అందజేసినట్టు మంగళవారం తెలిపారు. ఆయనతో పాటు అతని సోదరుడు బెల్లంకొండ రాయన్న రూ.25వేలు చెక్కును అందజేసినట్టు తెలిపారు. రాజధానిని తొందరగా అభివృద్ధి చేయాలని చంద్రబాబును కోరినట్టు తోమాసయ్య తెలిపారు. **(ముప్పాళ్ళ)**

నేడు మున్సిపల్ సమావేశం

పిడుగురాళ్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు జరుగనున్నదని చైర్‌పర్సన్ కొత్త వెంకట సుబ్బారావు తెలిపారు. అధికారులు, కౌన్సిలర్లు, సభ్యులు సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

హ్యూమన్ ఎక్సలెన్స్ సెంటర్ ప్రారంభం

మాచర్లటౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో స్వామి వివేకానంద ట్రస్ట్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన హ్యూమన్ ఎక్సలెన్స్ సెంటర్‌ను టీడీపీ యువనేత జూలకంటి అక్కిరెడ్డి ప్రారంభించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ఈ సెంటర్‌ను ప్రారంభించినట్లు అక్కిరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ మెట్టు గోవిందరెడ్డి, రామకృష్ణ, తిరుపతిరెడ్డి, తుమ్మా జోజిరెడ్డి, అల్లం ప్రతాపరెడ్డి, డాక్టర్ రాజశేఖరరెడ్డి, పాపిరెడ్డి, చంద్రయ్య, రామాంజి, చంద్రారావు, చెన్నారెడ్డి, లాల్‌సాహెబ్, లక్ష్మి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే పీడీ యాక్ట్

● క్రోసూరు ఎక్సైజ్ సీఐ తులసీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ తులసీ

క్రోసూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ మద్యం దుకాణదారులు అక్రమ మద్యం విక్రయించినా, బెల్టు షాపులు నిర్వహించినా ముందుగా హెచ్చరిస్తామని, తరువాత జరిమానాలు విధిస్తామని, పద్ధతి మార్చుకోకపోతే పీడీ యాక్ట్ ప్రయోగానికి కూడా వెనుకాడమని క్రోసూరు ఎక్సైజ్ సీఐ టీ తులసీ హెచ్చరించారు. క్రోసూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ప్రైవేట్ మద్యం దుకాణదారులతో మంగళవారం ఆమె సమావేశం అయ్యారు. అనధికార మద్యం విక్రయించే వారి లైసెన్స్‌లు కూడా రద్దు చేస్తామన్నారు. మద్యం సీసాపై ముద్రించిన ఎంఆర్‌పీ ధరకే మద్యం విక్రయించాలని, లేకపోతే చర్యలు తప్పవన్నారు. ఆమెతో పాటు ఎక్సైజ్ ఎస్‌ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు : సీఐ విజయకుమార్

సత్తెనపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎవరైనా ప్రైవేట్ మద్యం దుకాణదారుడు బెల్టు షాపులు నిర్వహిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి ఎక్సైజ్ సీఐ పీ విజయకుమార్ హెచ్చరించారు. ముఖ్యమంత్రి, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం ఎక్సైజ్ స్టేషన్‌లో ప్రైవేట్ మద్యం షాపుల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు.

ఇన్‌చార్జి ఎంఈవో-1గా శ్రీనివాసరెడ్డి

కారంపూడి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కారంపూడి మండల ఇన్ చార్జి ఎంఈవో- 1గా శ్రీనివాసరెడ్డిని మంగళవారం ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి నియమించారు. ఎంఈవో- 2 రవికుమార్‌పై ఎంఈవో- 1 కాంతారావు దుర్భాషలాడడంతో కాంతారావును విధుల నుంచి తొలగించారు. మాచవరం మండలం పిల్లుట్ల గ్రామ హైస్కూల్ హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరెడ్డిని ఎంఈవో - 1గా నియమించారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

స్టాల్స్ ఏర్పాటులో అధికారులపై ఆర్డీవో ఆగ్రహం

మాచర్లటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా దీపావళి మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని గురజాల ఆర్డీవో మురళీకృష్ణ హెచ్చరించారు. మాచర్ల పట్టణంలో మంగళవారం కొందరు అనుమతులు లేకుండా స్టాల్స్ ఏర్పాటు చేయడాన్ని గుర్తించిన ఆర్డీవో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులు లేకుండా స్టాల్స్ ఏర్పాటు చేస్తుంటే ఏం చేస్తున్నారంటూ మండిపడ్డారు. అలాగే దీపావళి మందుల హోల్‌సేల్ దుకాణాలను పరిశీలించి అనుమతులపై, భద్రతా చర్యలను తనిఖీ చేశారు. ఆర్డీవో వెంట మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, ఇన్‌చార్జి తహసీల్దార్ వాణి, సిబ్బంది ఉన్నారు.



సివిల్ సప్లయి గోడౌన్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో మురళీకృష్ణ

సివిల్ సప్లయి గోడౌన్‌ను పరిశీలన

మాచర్ల పట్టణంలోని సివిల్ సప్లయి గోడౌన్‌ను ఆర్డీవో మురళీకృష్ణ మంగళవారం పరిశీలించారు. స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రేషన్ షాపునకు, మధ్యాహ్న భోజన పథకానికి రేషన్ బియ్యంను సక్రమంగా అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట గోడౌన్ డీటీ మంగళగిరి సుధీర్, ఇన్‌చార్జి తహసీల్దార్ వాణి, సిబ్బంది ఉన్నారు.

అధికారులు సూచించిన మేరకే ఎరువులను వాడాలి

పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి మురళి

నకరికల్లు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రైతులు వ్యవసాయ శాఖాధికారులు సూచించిన ఎరువులను, సూచించిన మోతాదు మేరకే వాడాలని పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళి సూచించారు. మంగళవారం మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమా నికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వరిలో వ్యవసాయశాఖ అధికారులు సూచించిన రసాయనిక ఎరువులు వాడ టం వల్ల ఖర్చు తక్కువలో మంచి దిగుబడి సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఖరీఫ్‌లో ఈ పంట నమోదు చేసుకున్న రైతులకు ధ్రువీకరణ పత్రాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో పిడుగురాళ్ళ ఏడీఏ పీ శ్రీకృష్ణ దేవరా యలు, మండల ఏవో కే దేవదాసు, ఏఈవో కే దిలీప్ కుమార్, జేవీవో కే సీతారత్నం, వీఆర్‌వో లింగయ్య పాల్గొన్నారు. అలాగే చీమల మర్రిలో పొలం పిలుస్తుంది కార్యక్ర మంలో ఏవో దేవదాసు, డీఆర్‌సీ ఏవో ప్రవీణ్ కుమార్, వీఏఏ జగదీష్ పాల్గొన్నారు.



చల్లగుండ్లలో ఈ పంట నమోదు పత్రాన్ని రైతులకు అందజేస్తున్న మురళి

తేమ శాతం ఆధారంగా మద్దతు ధర

● ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు

మాచవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పత్తిలో తేమశాతం ఆధారంగా ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందని పిడుగురాళ్ళ ఏడీఏ శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. మంగళవారం మండలంలోని కొత్తగణేషునిపాడు, మల్లవోలు గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు ముఖ్య అతిథిగా హాజరై వివిధ రకాల పంటలను పరిశీలించారు.

నేడు నగర పంచాయతీ సమావేశం

దాచేపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ సమావేశం బుధవారం సచివాలయం-1లో నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ అప్పారావు మంగళవారం తెలిపారు. చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అధ్యక్షతన సాధారణ సమావేశం జరుగుతుందని, సభ్యులందరూ హాజరు కావాల్సిందిగా కోరారు.

సబ్‌జైలును తనిఖీ చేసిన న్యాయమూర్తి

గురజాల లీగల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ జైలును గుంటూరు లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, న్యాయమూర్తి పి.లీలావతి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి జైల్లోని ముద్దాయిల కేసుల వివరాలను అడిగి తెలుసుకు న్నారు. న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్థోమత లేనివారు దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. సకాలంలో వైద్యం, భోజన సదుపాయాలు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. వంటగది, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. ఆమె వెంట న్యాయవాదులు కలివెల ప్రభుదాసు, జైలు సూపరింటెండెంట్ సీహెచ్ సుబ్బారెడ్డి, అదాలత్ సిబ్బంది ఉన్నారు.

జడ్పీ భూములకు కౌలు సక్రమంగా చెల్లించాలి

● జిల్లాపరిషత్ డిప్యూటీ సీఈవో కృష్ణ



ఎంపీడీవో కార్యాలయంలో కౌలు రైతులు, ఇతర అధికా రులతో మాట్లాడుతున్న జడ్పీ డిప్యూటీ సీఈవో కృష్ణ తదితరులు

దాచేపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లా పరిషత్ భూములను సాగుచేసుకుంటున్న రైతులు కౌలు సక్రమంగా చెల్లించాలని గుంటూరు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ కోరారు. మంగళవారం దాచేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో కౌలు రైతులు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. దాచేపల్లి, ఇరికేపల్లి గ్రామాల్లో జిల్లా పరిషత్‌కు చెందిన 18 ఎకరాల 40 సెంట్లు భూమి ఉన్నట్లు వివరించారు. నాలుగేళ్లుగా కౌలు సక్రమంగా చెల్లించడం లేదని వివరించారు. కౌలు చెల్లించని రైతులకు నోటీసులు ఇచ్చామని, మరికొందరు రైతులను నేరుగా పిలిపించి మాట్లాడినట్లు తెలిపారు. ఈ సమావేశంలో దాచేపల్లి ఎంపీడీవో రామకృష్ణ, ఏవో రత్నం తదితరులున్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ముప్పాళ్ళ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తొండపి, దమ్మాలపాడు గ్రామాల్లో జరుగుతున్న పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన సీసీ డ్రెయిన్స్‌ను మంగళవారం డ్వామా పీడీ ఎం సిద్ధలింగమూర్తి, ఏపీడీ పీవీ నారాయణలు పరిశీలించారు. ఈ సందర్భంగా సిద్ధ లింగమూర్తి మాట్లాడుతూ పనులను నాణ్యతగా చేయాలన్నారు. ఆయన వెంట ఏపీవో ఏడుకొండలు, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు దరఖాస్తు చేయించాలి

ముప్పాళ్ళ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టభద్రులందరితో దరఖాస్తు చేయించాలని ఎంపీడీవో పీజే విలి యమ్స్, తహసీల్దార్ లక్ష్మీ ప్రసాదులు అన్నారు. ముప్పాళ్ళలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు ప్రక్రియపై సచివాలయ సిబ్బందికి మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటివరకు 434 మంది ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. గ్రామాల్లో పట్టభద్రులను గుర్తించి ఓటు దరఖాస్తు కోసం అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రూపవతి, ఏపీఎం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయంలో ఫిర్యాదు చేయాలి

సత్తెనపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంచినీటి లో ఏదైనా సమస్య వస్తే ఆయా వార్డు పరిధిలోని సచివాలయంలో ప్రజలు ఫిర్యాదు చేయాలని మున్సిపల్ కమిషనర్ షమ్మి మంగళ వారం తెలిపారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో ఎటువంటి సమస్యలు ఉన్నా తెలపాలన్నారు.

వీరయ్య మృతి పార్టీకి తీరని లోటు

బెల్లంకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన రావూరి వీరయ్య మృతి పార్టీకే తీరని లోటు అని మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి తెలిపారు. మంగళవారం వీరయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరయ్య టీడీపీకి చేసిన సేవల గురించి కొనియాడారు.

ఇసుక రీచ్‌లలో ఆర్డీవో ఆకస్మిక తనిఖీ



మల్లాది ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా మండల పరిధిలోని మల్లాది, దిడుగు గ్రామాల పరిధిలో రాత్రి వేళల్లో ఇసుక అక్రమ క్వారీయింగ్ చేసి లారీల్లో తరలిస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారన్న సమాచారంతో జేసీ ఆదేశాల మేరకు సత్తెనపల్లి ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా రీచ్‌లను సందర్శించారు. రెండు రీచ్‌లలో ఎక్స్‌కవేటర్ ద్వారా ఇసుకను తీసి క్వారియింగ్ చేసినట్లు గుర్తించారు. ఆర్డీవో వస్తున్నారన్న సమాచారంతో ఎక్స్‌కవేటర్‌లను నదిలో నుంచి తరలించి గ్రామంలో ఓ ఖాళీ ప్రదేశంలో ఉంచారు. రీచ్‌లలో కూడా ఎవరూ లేకుండా పోయారు. ఇసుక క్వారీయింగ్ విషయమై స్థానిక గ్రామ రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకుని వెళ్లారు. రెండు రీచ్‌లలో తన దృష్టికి వచ్చిన విషయాన్ని జేసీ దృష్టికి తీసుకువచ్చి ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు. దాచి ఉంచిన ఎక్స్‌వేటర్‌లను సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించాలని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావును ఆదేశించారు. అధికారుల వెంట రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యను రూపు మాపేందుకే జాబ్ మేళాలు

● జిల్లా అధికారి తమ్మాజీరావు



మాట్లాడుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి

క్రోసూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ సమస్యను రూపుమాపేందుకే రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ జిల్లా అధికారి ఈ తమ్మాజీరావు అన్నారు. మంగళవారం క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన జాబ్ మేళాకు 141 మంది అభ్యర్థులు తమ పేర్లను రిజిస్టర్ చేయించుకున్నారు. అభ్యర్థులను ఉద్దేశించి తమ్మాజీరావు మాట్లాడారు. మొత్తం నాలుగు కంపెనీలు జాబ్ మేళాకు హాజరయ్యాయి. 54 మందిని వివిధ ఉద్యోగాల కోసం ఎంపిక చేసుకున్నారు. వారికి వెంటనే నియామక పత్రాలు అందజేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ రమాదేవి ముఖ్యఅతిథిగా హాజరై ఎంపికైన అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడారు. భవిష్యత్‌లో ఉన్నత స్థితికి చేరుకోవటానికి దీనిని మొదటి మెట్టుగా భావించాలన్నారు. జాబ్ మేళా క్రోసూరులో నిర్వహించటం అభినందనీయమన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది పీ శ్రీకాంత్, రామకృష్ణ, కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తొమ్మిది గంటల విద్యుత్‌ను ఇవ్వాలి

● పల్నాడు జిల్లా ఎస్ఈ పీ విజయకుమార్



నకరికల్లు విద్యుత్ సబ్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న పల్నాడు జిల్లా ఎస్ఈ పీ విజయకుమార్

నకరికల్లు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగానికి తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్‌ను ఇవ్వాలని పల్నాడు జిల్లా ఏపీసీపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీరు పత్తిపాటి విజయకుమార్ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఆయన నకరికల్లు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ నిర్వహించి రికార్డులను పరిశీలించారు. సెక్షన్ కార్యాలయంలో తనిఖీలు చేసి అధికారులకు సూచనలను ఇచ్చారు. మండలంలో రూ.15 లక్షల బకాయిలు ఉన్నట్టు గుర్తించారు. విద్యుత్ బకాయిలను వెంటనే వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ బకాయిలు వసూలు చేయటంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తొమ్మిది గంటలు వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను ఇచ్చే సమయంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గృహాలకు సరఫరా చేసే విద్యుత్ విషయంలోను ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయంపై ఫిర్యాదులు అందుతున్నట్టు తెలిపారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని, లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు డీఈఈ భవనం వెంకటేశ్వరరెడ్డి, ఏఈఈ సురేష్‌బాబు, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా అనధికారికంగా విక్రయిస్తే కేసులు : సీఐ

పిడుగురాళ్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా అనధికారికంగా మందులు విక్రయిస్తే కేసు నమోదు చేస్తామని సీఐ ఎస్ వెంకట్రావు తెలిపారు. గుర్తింపు పొందిన ప్రదేశంలోనే ఆయా వ్యక్తులు నిర్ణీత ధరలకే బాణసంచా విక్రయించాలని, అధిక ధరలకు, అనధికార విక్రయాలకు పాల్పడినా తీవ్ర చర్యగా పరిగణించి కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

అనుమతి లేకుండా అమ్మరాదు : ఎస్ఐ

నకరికల్లు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా దీపావళి మందులు అమ్మరాదని ఎస్ఐ చల్లా సురేష్ దుకాణదారులకు సూచించారు. సోమవారం రాత్రి నకరికల్లు పోలీసు స్టేషన్‌లో దీపావళి మందులు అమ్మే దుకాణ దారులను పిలిపించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. సంబంధిత శాఖల అనుమతులు తీసుకున్న తరువాతనే దీపావళి మందులను అమ్మాలని సూచించారు. అనుమతులు లేకుండా అమ్మినా, నిబంధనలు అతిక్రమించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరికాలు జారీ చేశారు.

రైతు సేవా కేంద్రాల్లో నమోదు తప్పనిసరి : ఏవో

దాచేపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పత్తిరైతులు సీసీఐ కేంద్రాల ద్వారా పత్తిని అమ్ముకోవాలంటే ముందుగా రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని దాచేపల్లి ఏవో పాపకుమారి తెలిపారు. పత్తి ధర క్వింటాల్ రూ.7,521 ఉందని వివరించారు. పత్తిని రైతులు సీసీఐ కేంద్రాలకు లూజుగానే కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లాలని తెలిపారు. పత్తిపంటలో రామాపురం గ్రామానికి చెందిన పత్తి పంటలో అంతర సాగు పద్ధతులపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం-కార్యదర్శి డాక్టర్ జి.రమేష్, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ కేవీకే మాట్లాడుతూ అంతర్ సాగు పద్ధతిలో మొక్కల మధ్య దూరం తగ్గడం ద్వారా పొలాల్లో సంప్రదాయ పద్ధతికన్నా ఎక్కువ మొక్కలు పెంచుకోవచ్చన్నారు. దీనివల్ల దిగుబడి కూడా పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో టి వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు వాటర్ పైపులైనుకు మరమ్మతులు

దాచేపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురం, ఇరికేపల్లి గ్రామాల్లో ఈ నెల 30వ తేదీన నీటి సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ అప్పారావు మంగళవారం తెలిపారు. బుధవారం నారాయణపురం, ఇరికేపల్లి గ్రామాల్లో పైపులైన్లకు లీకేజీలను తొలగించే కార్యక్రమంలో భాగంగా మరమ్మతులు చేపడుతున్నట్లు వివరించారు. గ్రామస్థులు సహకరించాల్సిందిగా కోరారు.

అధిక మొత్తంలో రుణాలు పొందాలి

సత్తెనపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి చిన్న మొత్తాల రుణాలతో తృప్తి చెందకుండా ఎక్కువ మొత్తంలో రుణాలు పొంది పరిశ్రమలు పెట్టే స్థాయికి ఎదగాలని యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా సత్తెనపల్లి శాఖ మేనేజర్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఖాతాదారుల చైతన్య అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయని, వాటిని ఖాతాదారులు ఉపయోగించుకోవాలన్నారు. సదస్సులో ల్యాంప్ సంస్థ డైరెక్టర్ సాల్మన్‌పాల్, కే వెంకటేశ్వరరావు, మెప్మా టీఎంసీ మహమ్మద్ ఖాజా వలి, ల్యాంప్ సంస్థ రిసోర్స్‌పర్సన్ బాజీ, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణలో 18 మందిపై కేసు

సత్తెనపల్లి రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమెరపూడిలో ఆదివారం రాత్రి టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య జరిగిన ఘర్షణలో ఇరు పక్షాలకు చెందిన 18 మందిపై కేసు నమోదు చేసినట్టు రూరల్ సీఐ పీ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. టీడీపీకి చెందిన షేక్ జుల్ఫికర్ అలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మందులపాలెం మహబూబ్ సుభానీ, మరో తొమ్మిది మందిపై, వైసీపీకి చెందిన షేక్ మహమ్మద్ ఆలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు షేక్ హరుల్ మరో ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

గుర్తింపుపొందిన పార్టీలకు ఓటరు జాబితాలు పంపిణీ

నరసరావుపేట టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గుర్తింపు పొందిన పార్టీలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో కే వినాయకం ఓటరు జాబితాలు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు వల్లెపు కృపారావు, కాంగ్రెస్ నాయకుడు భాషా, సీపీఐ నుంచి కాసా రాంబాబు, గుడిపల్లి కృష్ణమోహన్, గుంటూరు విజయకుమార్, శిలార్, డి.శివకుమారి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్ల జగ్గారావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జోన్ డైరీ

● నరసరావుపేట ఏపీఎస్ఆర్టీసీ డిపోలో 30వ తేదీన 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని డీఎం బత్తుల వీరాస్వామి తెలిపారు. 9959225428 నంబరులో సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

నవంబరు 11 లోపు పరీక్ష ఫీజులు చెల్లించాలి: డీఈవో చంద్రకళ

నరసరావుపేట టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నవంబరు 11వ తేదీ లోపు పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజులు చెల్లించాలని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్ చంద్రకళ మంగళవారం తెలిపారు. నవంబరు 11లోపు ఫీజు చెల్లించలేని వారు ఆలస్య రుసుంతో నవంబరు 30వ తేదీలోపు ఫీజులు చెల్లించే వెసులుబాటు కల్పించామన్నారు. అన్ని చెల్లింపులు ఆన్‌లైన్‌లో బీఎస్ఈ.ఏపీ.ఈవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా మాత్రమే చెల్లించాలని, నామినల్ రోల్స్ మాన్యువల్ సమర్పణ అవసరం లేదన్నారు.

పంచారామ శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

చిలకలూరిపేట, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా పంచారామ శైవ క్షేత్రాలైన సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతిల సందర్శనకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు స్థానిక ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ ఎస్.రాంబాబు మంగళవారం తెలిపారు. నవంబరు 1నుంచి చిలకలూరిపేట డిపో నుంచి ప్రతి శనివారం, ఆదివారం రాత్రి10 గంటలకు బస్సులు బయలుదేరుతాయని వెల్లడించారు. ఇతర వివరాల కోసం డిపో మేనేజర్ 9959225427, డిప్యూటీ మేనేజర్ 63033 25113, జనరల్ ఏడీసీ 73828 93037 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

పత్తి రైతులకు అవగాహన సదస్సు

చిలకలూరిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులు పత్తిని పత్తి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేటపుడు పలు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సీసీఐ జనరల్ మేనేజర్ అమర్నాథరెడ్డి మంగళవారం అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో చిలకలూరిపేట ప్రాంతంలోని పత్తి రైతులకు పత్తి కొనుగోళ్లకు సంబంధించి అవగాహన కల్పిస్తూ సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అగ్రిట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి సూర్యప్రకాశరెడ్డి, సీసీఐ అధికారులు సంతోష్‌కుమార్, రాంప్రసాద్, రమేష్‌బాబు, సీసీఐ బయర్లు యోగేశ్వరరావు, మార్కెట్ యార్డు అధికారులు పాల్గొన్నారు.

పన్ను బకాయిలపై దృష్టి సారించండి: కమిషనర్ శ్రీహరిబాబు

చిలకలూరిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలో 2024 - 25 సంవత్సరానికి సంబంధించి ఆస్తి, కుళాయి, వ్యాపార భవనాల పన్నుల వసూళ్లకై నిర్దేశించిన లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయాలని మునిసిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు మంగళవారం సచివాలయ అడ్మిన్‌లను ఆదేశించారు. పురపాలక సంఘం పరిధిలోని రెవెన్యూ అధికారులు, 29 సచివాలయాల అడ్మిన్ లతో స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఇంటి పన్నులు,నీటి పన్నుల బకాయిలపై ఆయన సమీక్ష నిర్వహించారు. సమావేశంలో రెవెన్యూ అధికారి సుబ్బారావు, ఆర్ఐలు షేక్ ఖాదర్, గిరి, సచివాలయ అడ్మిన్‌లు పాల్గొన్నారు.

దీపావళి నుంచి దీపం-2: తహసీల్దార్ సుజాత

శావల్యాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని దీపావళి రోజున ప్రారంభించనుందని, 29 నుంచే గ్యాస్ బుక్ చేసుకోవచ్చని తహసీల్దార్ కె.సుజాత పిలుపునిచ్చారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ గ్యాస్ ఏజెన్సీలలో లబ్ధిదారులు రూ.840 చెల్లించి గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వం వారి ఆధార్ లింక్ ఉన్న బ్యాంక్ అకౌంట్‌కు 48 గంటల్లో నగదు జమచేస్తుందన్నారు. గ్రాడ్యుయేట్ల ఎమ్మెల్సీ ఓటుహక్కు కోసం తహసీల్దార్ కార్యాలయంలో లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, ధ్రువపత్రాలపై గెజిటెడ్ అధికారి సంతకం ఉండాలన్నారు.

వరిలో ఉల్లిపొడ నివారణకు చర్యలు చేపట్టాలి: డీడీఏ శివకుమారి

వినుకొండ టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) వరిలో ఉల్లిపొడ నివారణకు చర్యలు చేపట్టాలని డీడీఏ శివకుమారి సూచించారు. మండలంలోని అందుగలపాడు, నీలగంగారంలో మండల వ్యవసాయ అధికారి అంజిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్సీ, డీడీఏ శివకుమారి పాల్గొని వరి, కంది, మిరప పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఏ పురుషోత్తమరెడ్డి, వీహెచ్ఏ నారాయణ, రైతులు పాల్గొన్నారు.

90 శాతం నట్టల నివారణ మందుల పంపిణీ పూర్తి: డీడీ రామారావు

శావల్యాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలోని 28 మండలాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ 90శాతం పంపిణీ పూర్తయిందని జిల్లా పశుసంవర్ధకశాఖ డీడీ రామారావు అన్నారు. శావల్యాపురం పశువైద్యశాలలో కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు చేస్తున్నారన్న ఫిర్యాదుపై విచారణ చేసేందుకు ఏడీ రామచంద్రయ్యతో కలసి మంగళవారం ఆయన శావల్యాపురానికి వచ్చారు.

సాగునీరు అందక ఎండుతున్న పంటలు

● ఇక్కట్లు పడుతున్న రైతులు ● చర్యలు తీసుకోవాలని అధికారులకు వినతి

కారుమంచి (శావల్యాపురం) అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారుమంచిలో పంట పొలాలకు సాగునీరు అందక పంటలు ఎండి, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు ఐదున్నర అడుగులు సాగునీరు వదిలితేనే కారుమంచి పొలాలకు సాగునీరందించే కొప్పరం మేజర్‌కు సాగునీరు చేరుతుందని, దాంతో రైతులు పంట పొలాలను సాగు చేస్తారు. కానీ అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు ఐదున్నర అడుగుల లోపే సాగునీరు విడుదల చేస్తుండడంతో సాగునీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. సాగునీరు లేక కొప్పరం మేజర్ పరిధిలోని రైతులు ఇప్పటివరకు సుమారు 150 ఎకరాలలో పంటలు సాగు చేయలేదని, కొంతమంది రైతులు ప్రారంభంలో వరి పంటను సాగుచేయగా సాగునీరు అందక భూమి బీటలు వారుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగర్ కెనాల్‌లో పుష్కలంగా నీరున్నప్పటికీ ప్రభుత్వం సాగునీరు తగినంత విడుదల చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రైతుల అవసరాలకు అనుగుణంగా సాగునీరు విడుదల చేయాలని గ్రామానికి చెందిన రైతులు నాదెండ్ల నరసింహారావు, బొమ్మినేని చంద్రాజనేయులు, నల్లబోతు కోటేశ్వరరావు, మల్లాపరపు వెంకయ్య, ఐతం నాగేశ్వరరావు, చుండూరి బోసు, మోరబోయిన వెంకట్రావు, మల్లాపరపు మరియబాబు తదితరులు కోరారు.



కారుమంచిలో సాగునీరులేక బీటలు వారిన వరి పొలం

ప్రతి ఒక్కరికీ ఉద్యోగ, ఉపాధే లక్ష్యంగా నైపుణ్య శిక్షణ

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యువతరంలో ప్రతి ఒక్కరికీ ఉద్యోగం లేదా ఉపాధి కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు పెద్దఎత్తున చేపడుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మంగళవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్ఆర్టీ సెంటర్‌లో మోడరన్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఉద్యోగ మేళాను ఎమ్మెల్యే ప్రత్తిపాటి సందర్శించారు. ఇంటర్వ్యూలకు నిరుద్యోగులతో మాట్లాడి ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందించారు.



ఉద్యోగ మేళాలో ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

అభివృద్ధి గురించే చర్చించుకుంటున్నారు: ఎమ్మెల్యే

చిలకలూరిపేట అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జగన్‌మోహన్‌రెడ్డి తప్ప ప్రజలందరూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి గురించే మాట్లాడుకుంటున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మంగళవారం చిలకలూరిపేట మండలం లింగంగుంట్లలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శంకు స్థాపన చేశారు. రూ 10 లక్షల వ్యయంతో సీసీ రహదారులు, డ్రెయిన్‌ల నిర్మాణానికి భూమి పూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు.

చికిత్స కోసం ఆర్థిక సాయం

పట్టణానికి చెందిన షేక్ నాగూర్ సుభానీకి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ 8,11,200 ఎల్వోసీని అందించారు. కార్యక్రమంలో వార్డు పార్టీ అధ్యక్షులు ఆరే మల్లికార్జునరావు, పార్టీ నాయకులు ఎం.రత్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఫీజుల్లో రాయితీలిప్పించరూ

జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే నాయకులు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం ప్రత్తిపాటిని ఆయన నివాసంలో కలసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అన్నదాసుల గిరి, షేక్ సత్తార్, పావులూరి బుజ్జి, ఉప్పాల బాజీ తదితరులు ఉన్నారు.

నాయీ బ్రాహ్మణులకు మేలు చేసిన పార్టీ టీడీపీ

చిలకలూరిపేట అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాయి బ్రాహ్మణుల సంక్షేమాన్ని చూసి వారికి మేలు చేసే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీయేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలోని జంపని భాస్కరరావు కల్యాణ మండపంలో మంగళవారం నాయీ బ్రాహ్మణుల ఆధ్వర్యంలో వైద్య నారాయణ శ్రీభగవాన్ ధన్వంతరీస్వామి జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, చదలవాడ అరవింద బాబులు హాజరయ్యారు. వీరిద్దరిని సంఘ నాయకులు శాలువాలతో సత్కరించి ధన్వంతరీ స్వామి చిత్రపటాలను బహూకరించారు.



ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి, చదలవాడలను సన్మానిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు

24గంటల్లో ప్రజా సమస్యల పరిష్కారం

9933585666 వాట్సాప్ నంబర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే జీవీ ఆంజేయులు

వినుకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) ప్రజా సమస్యలపై ప్రత్యేక గ్రీవెన్సుకు వాట్సాప్ నంబర్‌ను 9933585666 మంగళవారం ఏర్పాటుచేశారు. గ్రీవెన్సు నంబర్‌కు వచ్చిన సమస్యలను 24 గంటల్లో పరిష్కరిస్తారని, మున్సిపల్ అధికారులు వేగంగా పరిష్కారాలు చూపాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు. పురపాలక సంఘం ద్వారా సమర్థ సేవలు అందించడం, జవాబుదారీతనం కోసం ఈ నంబర్‌ను ఏర్పాటుచేశామన్నారు. ముందుగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వీధి దీపాలను మరమ్మతుల వీధి దీపాలతో పాటు కొత్త వీధి దీపాలను జీవీ పరిశీలించి మున్సిపల్ కమిషనర్‌కు పలు సూచనలు అందచేశారు. దీపావళి నాటికి పట్టణంలోని సెంట్రల్ లైటింగ్ లైట్లు వెలిగించాలని, పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌లో పట్టణాన్ని ముందుకు తీసుకుపోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, కమిషనర్ సుభాష్ చంద్రబోస్ అధికారులు పాల్గొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన మెప్మా బజార్‌ను మంగళవారం ఎమ్మెల్యే జీవీ పరిశీలించారు. మహిళా సంఘం సభ్యులు తయారుచేసిన వివిధ వస్తువులు, పిండి పదార్థాలు, వస్త్రాలు, బొమ్మలు, పరిశీలించి స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

రోడ్ల మరమ్మతులు ప్రారంభం

వినుకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర వ్యాప్తంగా ప్రమాదరహితంగా రోడ్లు ఏర్పాటు చేయడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. వైసీపీ పాలనలో భారీ గుంతలతో అధ్వానంగా మారిన రహదారులకు కోటి రూపాయల వ్యయంతో వినుకొండలోని కాలవ కట్ట వద్ద ఉన్న కారంపూడి రోడ్డు నుంచి మాచర్ల వరకు రోడ్డుపై మరమ్మతుల కార్యక్రమానికి ఎమ్మెల్యే జీవీ మంగళవారం పనులు ప్రారంభించారు. అదేవిధంగా పట్టణంలోని కారంపూడిరోడ్డు వెన్నెల సూపర్ బజార్ వద్ద ప్రధాన రహదారిపై ఉన్న గుంతలకు కంకరపోసి మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వినుకొండలోని రహదారులకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాల నివారణ చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కారంపూడి రోడ్డులో ప్రధాన రహదారికి మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, పార్టీ నాయకులు

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

వినుకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలనను ముందుకు తీసుకుని వెళ్లాల్సిన బాధ్యత యువత, పట్టభద్రులపైనే ఉందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక శివయ్య స్తూపం సెంటర్‌లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఓటు ఉన్నా ప్రతి ఒక్కరు మరలా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

కాలువలో వ్యర్థాల తొలగింపు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక నవోదయ నగర్, ఎస్ఎస్‌పీ కాలనీ కాలువ కట్ట శివాలయం, అయ్యప్పస్వామి గుడి వద్ద కార్తీక మాసం సందర్భంగా దీక్షా స్వాములు, మహిళలు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పర్యవేక్షణలో ఆలయాల వద్ద కాలువలోని జమ్ము, చొప్ప, నాచు తదితర వ్యర్థాలను మంగళవారం తొలగించారు. కమిషనర్ ఎం.జస్వంతరావు పురపాలక సంఘంలోని ప్రధాన రహదారులలో పర్యటించి పారిశుధ్యం మెరుగుపరచాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పర్యావరణ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు జీ రామకోటయ్య, పీ రమాదేవి, పర్యావరణ కార్యదర్శులు, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

మద్యం ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు: సీఐ వెంకటేశ్వర్లు

ఈపూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మద్యంను ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ డీ వెంకటేశ్వర్లు అన్నారు. ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రొంపిచర్ల, బొల్లాపల్లి, ఈపూరు మండలాలలోని మద్యం దుకాణాలను మంగళవారం ఎస్ఐ కే శ్రీనివాసరావుతో కలిసి తనిఖీ చేశారు.

జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు జొన్నలగడ్డ విద్యార్థుల ఎంపిక

నరసరావుపేట టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సైక్లింగ్ పోటీలలో జొన్నలగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు జాతీయస్థాయికి ఎంపికయ్యారని హెచ్ఎం మల్లికార్జునరావు మంగళవారం తెలిపారు. ఎన్టీఆర్ కృష్ణా జిల్లాలోని నున్న ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీలలో ఈ ఘనత సాధించారన్నారు. అండర్-19 బాలుర విభాగంలో 20 కిలోమీటర్లు మాస్ స్టార్ట్‌లో జేడీ ప్రసన్నకుమార్ మొదటిస్థానంలో నిలిచారని అన్నారు. అండర్-17 బాలికల పది కిలోమీటర్ల ట్రైన్ ప్రైస్ విభాగంలో కే బిందు పూర్ణిమ ప్రథమ స్థానం, అండర్-17 బాలుర పది కిలోమీటర్ల టైం ట్రైల్ విభాగంలో ఎం శశికుమార్ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ ముగ్గురు డిసెంబర్‌లో బీహార్‌లోని పాట్నాలో జరగనున్న జాతీయస్థాయి పోటీలలో మన రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. కాగా అండర్-14 బాలికల ట్రాక్ టైం ట్రైల్స్ విభాగంలో ఇదే పాఠశాలకు చెందిన కే రిబ్కా రాణి తృతీయ స్థానంలో నిలిచారు.

మిరప పొలాలను పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారులు

రొంపిచర్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీరవట్నం, అన్నవరపాడు గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఏవో శివలలిత, హార్టికల్చర్ అధికారి నవీన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్, పశు సంవర్ధక శాఖ అధికారులు, ఇన్‌చార్జ్ సర్పంచ్‌లు జాష్టి ప్రసాదు, గోపు చిన వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ ఇంటర్నెట్ దినోత్సవం

నరసరావుపేట టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెట్లూరివారిపాలెంలోని ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ ఇంటర్నెట్ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో క్విజ్, సెమినార్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పోటీలలో విజేతలకు ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి బహుమతులు అందజేశారు.

స్కూల్‌గేమ్స్ బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపికలు

శావల్యాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ బాలికల అండర్-14, అండర్-17 జట్లు ఎంపిక పోటీలను శావల్యాపురం జడ్పీ పాఠశాలల్లో మంగళవారం నిర్వహించారు. జిల్లా జట్ల ఎంపిక పోటీలకు సుమారు 15 జడ్పీ పాఠశాలల నుంచి మొత్తం 100మంది బాలికలు పాల్గొన్నారు. అండర్-14 విభాగంలో 13మందిని, అండర్-17 విభాగంలో 13మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. పాఠశాల హెచ్ఎం బొడ్డపాటి విజయలక్ష్మి మాట్లాడుతూ స్కూల్‌గేమ్స్ క్రీడాపోటీలలో శావల్యాపురం జడ్పీ పాఠశాలకు చెందిన ఏడుగురు బాలికలు అత్యున్నతమైన ప్రతిభను కనబరచారని, అండర్-17 జట్టుకు సమీర, లూథియా, కావ్య, దివ్య, దేవమణిలు, అండర్-14 జట్టుకు లలిత, హర్షితలు ఎంపికయ్యారని తెలిపారు. పల్నాడు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అసిస్టెంట్ సెక్రటరీ, పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ అండర్-14కి ఎంపికైన బాలికలు నవంబరు 6, 7, 8తేదీలలో అన్నమయ్య జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో, అండర్-17కి ఎంపికైన బాలికలు రాజమండ్రిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో ఉమ్మడి గుంటూరుజిల్లా జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలికలను పీఎంసీ ఛైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, హెచ్ఎం విజయలక్ష్మి, స్టాఫ్ సెక్రటరీ బీవీ నాగేశ్వరరావు, శ్రీనివాసరాజు, శ్రీకాంత్, పల్నాడు జిల్లా పీఈటీల సంఘం అధ్యక్షుడు ఖాదర్ మస్తాన్, ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి శివశంకర్, కమిటీసభ్యులు సాంబిరెడ్డి తదితరులు అభినందించి బహుమతులందజేశారు.

పొలాలను సందర్శించిన లాం శాస్త్రవేత్తలు

చిలకలూరిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటలోని పురుషోత్తమపట్నం, లింగంగుంట్ల గ్రామాలలోని మొక్కజొన్న పంట పొలాలను బుధవారం లాం శాస్త్రవేత్తలు పరిశీలించారు. విత్తనాల నాణ్యతపై అనుమానం ఉందని, మొక్కజొన్న కండె సైజు సరిగా లేదని లింగంగుంట్ల గ్రామ రైతు మేడూరి సురేష్ ఫిర్యాదు మేరకు శాస్త్రవేత్తలు సీవీ చంద్రమోహన్‌రెడ్డి, డాక్టర్ జి.అన్నె దయానా గ్రేస్, పుష్పరేణి మొక్కజొన్న రకం భారతి 756వేసిన పొలాలను పరిశీలించారు. మొక్కజొన్న కంకులను, మొక్కలను తీసుకువెళ్లారు. పరిశీలన పూర్తయ్యాక తమ నివేదికను జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి అందచేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు పి మస్తానమ్మ, టి శ్రీలత, జీపీ శ్రీనివాసరావు, వీఏఏలు కె నాగవర్ధరాణి, ఎం వెంకటేశ్వర్లు, రైతు మేడూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కోటప్పకొండకు ప్రత్యేక బస్సులు

● చిలకలూరిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ రాంబాబు



చిలకలూరిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తామని చిలకలూరిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.రాంబాబు ఆంధ్రజ్యోతితో అన్నారు.

ప్రశ్న: కార్తీక మాసంలో మీ ప్రణాళిక ఏమిటి?

జవాబు: కోటప్పకొండకు ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించాము. చిలకలూరిపేట నుంచి ప్రయాణికులు నేరుగా కొండపైకి వెళ్లే విధంగా ఏర్పాటు చేస్తాం.

ఫటా ఫట్

ప్ర: రద్దీ వేళలలో గుంటూరు, విజయవాడలకు బస్సుల సంఖ్య తగినంతగా లేవని ప్రయాణికుల ఫిర్యాదు?

జ: ఈ సమస్యను తక్షణం పరిశీలన చేస్తాం. అవసరానికి తగ్గట్టుగా బస్సుల సంఖ్యను పెంచుతాం ప్రస్తుతం గుంటూరు మార్గంలో 14 పల్లె వెలుగు బస్సులు, విజయవాడ మార్గంలో ఆరు ఎక్స్ ప్రెస్ బస్సులు నడుపుతున్నాం.

ప్ర: గుంతలతో బస్ స్టేషన్ లోపలికి రావడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు, వర్షం వస్తే సమస్య మరింత తీవ్రంగా ఉంది కదా?

జ: ఈ సమస్యను యాజమాన్యం దృష్టికి, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లాము. ఆర్టీసీ సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ వారు పరిశీలిస్తున్నారు.

ప్ర: బస్ స్టేషన్ పరిస్థితి ఏమిటి?

జ: డిపోలో మొత్తం 85 బస్సులు ఉన్నాయి. అందులో అద్దె బస్సులు 25 ఉన్నాయి. 294 మంది సిబ్బంది ఇక్కడ పని చేస్తున్నారు. మొత్తం 76 షెడ్యూల్లలో బస్సులు పలు మార్గాల్లో నడుస్తున్నాయి.

ప్ర: కార్గో విభాగం పరిస్థితి ఏమిటి?

జ: కార్గో విభాగంలో పరిస్థితి పూర్తిగా మెరుగుపడింది గతంలో రోజుకు రూ. 5 వేలు ఆదాయం వస్తుండగా అది రూ.25 వేలకు పైగా ఉంది.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

నరసరావుపేట లీగల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడైన బొల్లాపల్లి మండలం మల్లేపల్లికి తండాకు చెందిన రామావత్ వెంకటేష్ నాయక్‌కు రిమాండ్ విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి ఆర్.ఆశీర్వాదంపాల్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. నిందితుడు నరసరావుపేటలో ఓ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తున్నాడు. డ్యాన్స్ నేర్పిస్తానని పట్టణానికి చెందిన ఓ బాలికను మభ్య పెట్టి అసభ్యంగా ప్రవర్తించాడు.

రోప్ స్కిప్పింగ్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

నరసరావుపేట టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ బాలుర పాఠశాలలో అండర్-14, 17 బాల, బాలికల రోప్ స్కిప్పింగ్ ఉమ్మడి గుంటూరు జిల్లా ఎంపికలు మంగళవారం నిర్వహించామని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్ సురేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. అండర్-17 బాలుర రోప్ స్కిపింగ్ గుంటూరు జిల్లా జట్లకు కండ్లగుంట జడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఎం.ప్రణీత్‌రాజు, ఎం మణికంఠ, యు మహేష్, జీ విజయ్, ఎస్ వెంకటేష్, కే చిన్న వెంకట కోటేశ్వరరావు, కే ప్రవీణ్ కుమార్, ముప్పాళ్ల జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన జీ ఆకాష్ ఎంపికయ్యారు. రోప్ స్కిపింగ్ అండర్-17 బాలికల విభాగంలో కండ్లగుంట జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన డీ ఆయేశా, ఎల్ భావన, సీహెచ్ శివపార్వతి, ఉప్పలపాడుకు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్‌కు చెందిన ఎం ఆనందా, జీ అంజలి, ఎస్ సుమతి, ముప్పాళ్ళ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఎం దివ్య, ఎం రమ్యశ్రీ, ఎంపికయ్యారు. రోప్ స్కిప్పింగ్ అండర్-14 బాలుర విభాగంలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు కండ్లగుంట జడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఎం భానుసాయి, ఎం.జాషువా, పీ మణికంఠ, వై డేవిడ్, కే మనోజ్, జీ చరణ్, మందడం జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన కే సాయి ప్రసన్న, ముప్పాళ్ళకు చెందిన వీ సాయి ఎంపికయ్యారు. రోప్ స్కిప్పింగ్ అండర్-14 బాలికల విభాగంలో కండ్లగుంట జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన జీ శృతి, ఎం లక్ష్మి జాహ్నవీ, ఉప్పలపాడు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్‌కు చెందిన కే ప్రేమలత, ముప్పాళ్ళ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన డీ విష్ణుప్రియ, బీ తనూజా, బీ రమ్య, అచ్చంపేట జడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఎస్ మౌనిక ఎంపియ్యారు. ఎంపికైన క్రీడాకారులను ఎంఈవో ఎస్ నాగేశ్వరరావు, హెచ్ఎం రవికాంత్, ఎన్ సురేష్‌కుమార్ అభినందించారు.

వార్డు సచివాలయాల్లో కమిషనర్ ఆకస్మిక తనిఖీ

చిలకలూరిపేట, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని 27, 28 వార్డుల సచివాలయాలను బుధవారం మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు ఆకస్మిక తనిఖీచేశారు. తనిఖీలలో భాగంగా సిబ్బంది హాజరు, రిజిస్టరులో సిబ్బంది సంతకాలు పరిశీలించారు. నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నట్టు దృష్టికి వచ్చిన సిబ్బందిపై చర్యలుంటాయని ఆయన స్పష్టం చేశారు.

కిక్ కొడితే.. పతకమే



● తమ్ముడు, భద్రాచలం సినిమాలను చూసి ఆసక్తి
● జాతీయ స్థాయిలో రాణించి ఏషియన్‌లో సత్తా చాటిన బాక్సర్
● వచ్చే ఏడాది ఇటలీలో జరిగే ప్రపంచకప్‌కు సిద్ధమవుతున్న క్రీడాకారుడు

కిక్ బాక్సింగ్‌లో రాణిస్తున్న నాగబాబు

రింగ్‌లో దిగి కిక్ కొడితే ప్రత్యర్థులు తలొగ్గాల్సిందే. పోటీలో పాల్గొంటే పతకం లేకుండా వెనుదిరగడు. అది జాతీయ స్థాయి అయినా.. అంతర్జాతీయ స్థాయిలో అయినా. ఇప్పుడిప్పుడే ప్రాచుర్యం పొందుతున్న కిక్ బాక్సింగ్‌లో మారుమూల గ్రామానికి చెందిన యువకుడు అనేక అద్భుతాలు సృష్టిస్తున్నాడు. పవన్‌కల్యాణ్ నటించిన తమ్ముడు, శ్రీహరి నటించిన భద్రాచలం సినిమాల్లో హీరోల ప్రదర్శనలను చూసి బాపట్ల జిల్లా రేపల్లె మండలం కారుమూరు గ్రామానికి చెందిన యాసం కోటి నాగబాబు రాష్ట్ర ప్రజలకు క్రీడను పరిచయం చేస్తూనే కిక్ బాక్సింగ్‌లో ప్రావీణ్యం సంపాదిస్తున్నాడు. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ పోటీలలో అనేక పతకాలు సాధించి, దాతలు సహకరిస్తే వచ్చే ప్రపంచ పోటీల్లో పాల్గొని రాష్ట్రానికి పతకాలు సాధిస్తానని ధీమాగా చెబుతున్నాడు కోటి నాగబాబు.

గుంటూరు(తూర్పు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలకు పణ్ణంగా పెట్టి ఆడే ఆట కిక్ బాక్సింగ్. దేశంలో ఇంకా అంతగా ప్రాచుర్యం పొందలేదు. అయినా ఉమ్మడి గుంటూరు జిల్లాలో మారుమూల గ్రామం నుంచి కిక్ బాక్సింగ్‌లో అంతర్జాతీయంగా కోటి నాగబాబు రాణిస్తున్నాడు. సామాన్య కుటుంబానికి చెందిన ఇతడు కిక్ బాక్సింగ్‌లో ప్రావీణ్యం సాధిస్తున్నాడు. ఇప్పటి వరకు అనేక పతకాలు సాధించాడు. బాక్సింగ్ కంటే కిక్ బాక్సింగ్ క్లిష్టతరం. ఒక్కోసారి ప్రాణం పోయే ప్రమాదం కూడా ఉంటుంది. అందుకే కొన్ని రాష్ట్రాలు ఈ క్రీడకు గుర్తింపు ఇవ్వడానికి వెనకడుగు వేస్తున్నాయి. అయినా కిక్ బాక్సింగ్‌పై ప్రేమతో ఈ క్రీడను ఎంచుకున్నానని నాగబాబు చెబుతున్నాడు. ఒకటి నుంచి పదో తరగతి వరకు రేపల్లె మండలం, అడవుల దీవిలో జరిగింది. ఆ తర్వాత గుంటూరులో ఉన్న బంధువుల ఇంట్లో ఉంటూ తైక్వాండోలో శిక్షణ తీసుకున్నాడు. శారీర దారుఢ్యాన్ని పరిశీలించి బాక్సింగ్ వైపు ప్రయత్నం చేయాలని కొంతమంది సూచించారు. దీనికి తోడు కిక్ బాక్సింగ్ నేపథ్యంలో రూపొందించిన తమ్ముడు, భద్రాచలం సినిమాలను చూసి స్ఫూర్తి పొంది ఆ దిశగా అడుగులు వేశాడు. ఈ క్రమంలో గుంటూరుకు చెందిన సీనియర్ కోచ్ ఆనందరావు శిక్షణ ఇచ్చారు. తైక్వాండ్‌లో జయంత్‌రెడ్డి శిక్షణ ఇచ్చారు. కిక్ బాక్సింగ్‌లో సీనియర్ కోచ్ పవన్ నుంచి నైపుణ్యాలు తెలుసుకున్నాడు. తొలుత తైక్వాండ్‌లో శిక్షణ పొందినా దానిని కొనసాగించలేక పోయాడు. రెవెన్యూశాఖలో పని చేసే తల్లి ప్రోత్సహంతో కిక్ బాక్సింగ్ వైపు వెళ్లి అద్భుతాలు సాధించాడు. 2022లో ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన పోటీలో మూడో స్థానంలో నిలిచాడు. 2023లో జరిగిన 69 కేజీల విభాగంలో జాతీయ పోటీలో 7వేల మంది పాల్గొనగా అందులో 17వ స్థానం నిలిచాడు. దీంతో జాతీయ సెలక్టర్ల దృష్టిలో పడి సిమ్లాలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికైయ్యాడు. 23 దేశాలు పాల్గొన్న ఈ పోటీలో కిక్ లైటింగ్, క్రియోటీ ఫామ్ విభాగాల్లో మూడో స్థానం సాధించాడు. ఊటీలో అంతర్జాతీయ శిక్షణకు ఎంపికై 2024లో జరిగిన నేషనల్ చాంపియన్‌షిప్‌లో ఐదో స్థానం సాధించాడు. ఈ ఏడాది అక్టోబరు 6 నుంచి కంబోడియాలో జరిగిన ఏషియాడ్‌లో అద్భుతాలు సృష్టించాడు. 84 కేజీల కిక్ లైటింగ్, లైటింగ్ కాంటాక్టు విభాగాల్లో 3, 4 స్థానాల్లో నిలిచి కాంస్య పతకాలు సాధించాడు. రాష్ట్ర చరిత్రలో రెండు పతకాలు సాధించిన ఏకైక క్రీడకారుడుగా నిలిచి 2025లో ఇటలీలో జరిగే ప్రపంచకప్‌కు ఎంపికయ్యాడు.


పతకాలతో కోటి నాగబాబు


కోటి నాగబాబును అభినందిస్తున్న తులసి రామచంద్రప్రభు, ఉగ్గిరాల సీతా రామయ్య తదితరులు


కోటి నాగబాబును సత్కరిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తల్లి ప్రోత్సహంతోనే...



రెవెన్యూ విభాగంలో పని చేసే మా అమ్మ ప్రోత్సాహంతో కిక్ బాక్సింగ్‌లో ప్రావీణ్యం సాధించాను. ఇప్పటి వరకు పాల్గొన్న పోటీలకు రూ.40 లక్షలు ఖర్చు కాగా పారిశ్రామికవేత్త తులసి రామచంద్రప్రభు ఆ మొత్తాన్ని భరించారు. టీడీపీ నాయకుడు ఉగ్గిరాల సీతారామయ్య కూడా సహకరించారు. శారీర దారుఢ్యానికి, ఆహారానికి నెలకు రూ.లక్ష అవసరం. ఇటలీలో జరిగే పోటీలకు వెళ్లేందుకు దాతలు సహకారం అవసరం ఉంది.

-యాసం కోటి నాగబాబు

పట్టభద్రుల ఓటుకు

లక్షా 24 వేల దరఖాస్తులు

రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ నాగలక్ష్మి


ఓటర్ జాబితాలపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతున్నదని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆమె ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరి రివిజన్ 2025, ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల నియోజకవర్గ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల ఓటర్ల నమోదుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టభద్రుల ఓటర్ల నమోదుకు ఇప్పటి వరకు ఫారం-18లు 1,24,504 అందాయన్నారు. నవంబరు 6వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదయ్యేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఆయా పార్టీల ప్రతినిధులు సేవా కుమార్, చిరుతనగండ్ల వాసు, సీహెచ్ కుమార్‌గౌడ్, సునీల్ కుమార్, ఎన్ ఓంకార్, డీఆర్వో పెద్ది రోజా, ఈఆర్వోలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, డీఆర్డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఓబులేసు, ఆర్డీవో శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఇస్మాయిల్, డీటీ ప్రదీప్ పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్‌లు

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏపీసీఆర్‌డీఏలో భూముల రిజిస్ట్రేషన్లు, పెండింగ్ భూసేకరణ/సమీకరణ, రైల్వే, ఇతర ప్రాజెక్టులకు అవసరమైన భూములను సమకూర్చాల్సి ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం పలువురు డిప్యూటీ కలెక్టర్లను పోస్టింగ్ చేసిందని. ఏపీసీఆర్‌డీఏ డిప్యూటీ కలెక్టర్-1గా ఏజీ చిన్ని కృష్ణ, డీసీ-2గా డీ హుస్సేన్ సాహెబ్, డీసీ-3గా గంధం రవీందర్, డీసీ-4గా ఎన్ఎస్‌వీటీ వసంతరాయుడు, డీసీ-5గా కేఎస్ భాగ్యరేఖ, డీసీ-6గా టీకే వెంకటేశ్వర్లు, డీసీ-7గా పీ పద్మావతిలను నియమించింది. గతంలో వేర్వేరు మండలాల్లో తహసీల్దార్‌గా విధులు నిర్వహించి డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందిన తాతా మోహన్ రావుకు ప్రోటోకాల్ డైరెక్టర్‌గా పోస్టింగ్ కల్పించింది. అలానే టీ బాపిరెడ్డిని శ్రీకాళహస్తి దేవాలయం ఈవోగా నియమించింది. గుంటూరు డీఆర్‌వో పెద్ది రోజాని బాపట్ల మెప్మా పీడీగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువరించింది.

దీపావళి రద్దీ నియంత్రణకు చర్యలు

● గుంటూరు రైల్వే డీసీఎం కమలాకర్‌బాబు


ప్రయాణికులతో మాట్లాడుతున్న రైల్వే అధికారులు

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ రద్దీ నియంత్రణకు గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని రైల్వేస్టేషన్లలో అన్ని చర్యలు చేపట్టినట్లు డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కమలాకర్‌బాబు చెప్పారు. మంగళవారం సాయంత్రం గుంటూరు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ నియంత్రణ చర్యలను ఆయన పర్యవేక్షించారు. టిక్కెట్ కౌంటర్లు, ఎల్ఈడీ డిస్‌ప్లే కోచ్ ఇండికేటర్ బోర్డులు, హెల్ప్ డెస్కు, ప్లాట్‌ఫాంపై రైలు వచ్చే సమయంలో ప్రయాణికులు ఒకేసారి రైలు ఎక్కేందుకు ప్రయత్నించకుండా ఆర్‌పీఎఫ్ చేస్తున్న కట్టడి చర్యలను ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. డివిజన్‌లోని అన్ని ముఖ్యమైన రైల్వేస్టేషన్లలో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశామని, ప్రత్యేక రైళ్ల వివరాలు, వాటి సమయ పట్టికలను ప్రదర్శిస్తున్నామన్నారు. రైళ్ల రాకపోకల సమాచారాన్ని తరచుగా మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా తెలియజేస్తున్నాం అన్నారు. రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో అదనపు టిక్కెట్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైలు బోగీల్లోకి అన్‌బోర్డింగ్, బోర్డింగ్ చేసే సమయంలో రోప్ పార్టీలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సిబ్బంది అందరూ యూనిఫాం ధరించి విధులకు హాజరౌతుండటం వలన ప్రయాణికులు వారిని సులభతరంగా గుర్తు పట్టొచ్చని చెప్పారు. క్యాటరింగ్ స్టాల్స్‌లో పరిశుభ్రమైన ఆహారం ఉండేలా చూస్తున్నామన్నారు. లిఫ్టులు, ఎస్కలేటర్లు 24 గంటలు పని చేసేలా చూస్తున్నాం. వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్‌ఛైర్లు, పోర్టర్లను అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్, సీఎమ్ఎస్‌ఆర్ జయకుమార్, సీటీఐ కె.శ్రీనివాసరావు, ఆర్‌పీఎఫ్ సీఐ వీరబాబు, ఎస్ఐ కె.క్రీస్తుదాసు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్ జిల్లాల చదరంగం పోటీలు

చుండూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): యడ్లపల్లి ఆలపాటి వెంకట్రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు సాగిన 68వ అంతర్ జిల్లాల అండర్-17 బాల బాలికల చదరంగం పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి 130 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరుపున ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో తూర్పు గోదావరికి చెందిన అల్లూరి భాస్కరరత్న షణ్ముఖరెడ్డి, కృష్ణా జిల్లాకు చెందిన తాళ్ల నిచ్చల్, కర్నూలుకు చెందిన యు.హర్షవర్ధన్, తూర్పు గోదావరికి చెందిన కనపర్తి సీతాసాగర్, విశాఖకు చెందిన వెంపరాల వెంకటేశ్వరరావు వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచారు. బాలికల విభాగంలో నెల్లూరు జిల్లాకు చెందిన గడ్డేటి హిమతేజస్విని, వేముల ప్రద్యుమ్నలక్ష్మి, గుంటూరు జిల్లాకు చెందిన ఆమంచి నాగశివసాయిదివ్య, అనంతపురంకు చెందిన జి.శిరీష, పశ్చిమ గోదావరికి చెంది సోనాలి శ్రీమణి, కార్తీక్ కన్న విజేతలుగా నిలిచారు. టీం ఈవెంట్ బాలుర విభాగంలో వరుసగా తూర్పు గోదావరి, విశాఖ, పశ్చిమ గోదావరి జిల్లా జట్లు, బాలికల విభాగంలో పశ్చిమ గోదావరి, గుంటూరు, నెల్లూరు జట్లు విజయకేతనం ఎగుర వేశారు. విజేతలైన వీరు మన రాష్ట్రం తరుపున నవంబరు 17 నుంచి మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ చదరంగం పోటీల్లో పాల్గొంటారు. విజేతలకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.పురుషోత్తం బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కుర్రా శ్రీనివాసరావు, రావి సాయిబాబా, భయ్యా సతీష్, విద్యా శాఖ అధికారులు ఆర్.చలపతిరావు, సాల్మన్‌రాజు, భానుప్రకాష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వేమూరి శరత్‌బాబు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న రౌడీషీటర్లు

ఉండేది ఒకచోట.. దందా మరోచోట
రౌడీషీటర్లతో పలువురు పోలీసుల దోస్తీ
సగానికి సగం మంది కౌన్సెలింగ్‌కు దూరం


గాయపడిన ఇంద్రజిత్


రౌడీషీటర్ సముద్రాల పవన్ (లడ్డూ)

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు రెచ్చిపోతున్నారు. పోలీసులు పట్టుకోల్పోతుండటంతో యథేచ్ఛగా దందాలు, బెదిరింపులు, వసూళ్లతో పాటు హత్యలు, హత్యాయత్నాలు, భూవివాదాలు, బెదిరింపులతో చెలరేగిపోతున్నారు. గడిచిన వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతల నీడన చేరిన రౌడీషీటర్లు పలువురు పోలీస్ వ్యవస్థకే సవాల్‌గా మారారు. ఆధిపత్యం కోసం ప్రత్యర్థులనే కాదు ఎదురు తిరిగితే అమాయకులను సైతం నడి రోడ్డుపై దారుణంగా హత్య చేసిన ఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి. గుంటూరులో పేరుమోసిన రౌడీషీటర్లు అజ్ఞాతంలో ఉంటూ తమ అనుచరులతో కార్యకలాపాలు సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పేరు మోసిన అనేక మంది రౌడీషీటర్ల కార్యకలాపాలు పోలీస్ వర్గాలకు సైతం అంతు పట్టని విధంగా ఉంది. వారు నివాసం ఉండేది ఒక ప్రాంతం అయితే.. కార్యకలాపాలు సాగించేది మరో ప్రాంతం, అదేవిధంగా వారిపై రౌడీషీట్ ఉండేది ఇంకో ప్రాంతంలోని స్టేషన్లో కావడం గమనార్హం కరడు కట్టిన అనేకమంది రౌడీషీటర్లు ఏం చేస్తున్నారనేది పోలీసులకు అంతుపట్టడం లేదు. ప్రతి ఆదివారం నిర్వహించే కౌన్సిలింగ్ కేవలం ఫొటోల ఫోజులకే పరిమితం అవుతుంది. ఆయా పోలీస్ స్టేషన్లో ప్రతి ఆదివారం నిర్వహించే కౌన్సెలింగ్‌కు సగానికి సగం మంది కూడా హాజరు కావడం లేదు. మిగిలిన వారి కార్యకలాపాలు ఏమిటనేది ఆరాతీసే ప్రయత్నం కూడా పోలీసులు చేయడం లేదు. కొన్ని స్టేషన్ల పరిధిలో పోలీసులు రౌడీషీటర్లకు సహకరిస్తున్నారనే ఆరోపణలు న్నాయి. కనీస భయం కూడా లేకుండా పోలీసులు చెలరేగిపోతుండటం ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. గుంటూరులో ఇటీవల రౌడీషీటర్ పాదర్తి రమేష్‌పై కోర్టుల్లో ఉన్న కేసులు కొట్టేయించేందుకు ఓ కానిస్టేబుల్ బరితెగించి వైసీపీ నేత గతంలో చనిపోయిన పాదర్తి రమేష్‌గాంధీ డెత్ సర్టిఫికేట్‌ను ఉపయోగించాడంటే రౌడీషీటర్ల విషయంలో పోలీసుల వైఖరి తేటతెల్లమవుతుంది.

తెనాలిలో భయంభయం..

ఒకప్పుడు ప్రశాంత తకు నిలయమైన తెనాలిలో రౌడీమూకలు చెలరేగుతున్నాయి. వైసీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తిన శివకుమార్ అండదండలతో కరుడుగట్టిన రౌడీషీటర్లు తెనాలిలో రెచ్చిపోయారు. ఐతానగర్ పేరు చెబితే కౌన్సిలర్ గడ్డేటి సురేంద్ర, ఆయన స్నేహితుడు సముద్రాల పవన్ కుమార్ అలియాస్ లడ్డు హత్యలతో తెనాలి వాసులను భయభ్రాంతులకు గురి చేసి ఆధిపత్యం ప్రదర్శించారు. అప్పట్లో ఎమ్మెల్యే శివకుమార్‌తో సురేంద్రకు బేధాభిప్రాయాలతో ఆయన మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్లకి అనుచరుడిగా కార్యకలాపాలు కొనసాగించాడు. ఆస్థానంలో మరో రౌడీషీటర్ లడ్డు వచ్చి చేరాడు. ఎన్నికలకు ముందు ఐతానగర్ ప్రాంతానికి చెందిన యువకుడి ద్విచక్ర వాహనం తగిలిందనే కారణంతో అతడిపై విచక్షణా రహితంగా దాడి చేసి కొట్టిన దృశ్యాలు అప్పట్లో సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. తాజాగా ఐతానగర్ ప్రాంతంలో నాజర్‌పేటకు చెందిన కాకుమాను ఇంద్రజిత్ అనే యువకుడు వాహనం ఆపలేదనే కారణంతో అతడిపై లడ్డు విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరచడమే కాకుండా ద్విచక్ర వాహనాన్ని దహనం చేశాడు. లడ్డు ఆగడాలకు హద్దులేకుండా పోతుందని పోలీసులు పట్టీపట్టినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిఘావర్గాలు రౌడీల కార్యకలాపాల గురించి ఆరా తీసినప్పటికీ ఆయా వివరాలు సేకరించి వారిపై దృష్టి పెట్టాల్సిన స్థానిక పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇదే అలుసుగా రౌడీషీటర్‌లు పెట్రేగిపోతున్నారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులోనూ అనేక మంది మాజీ రౌడీషీటర్‌లు పాల్గొన్నట్లు ఇప్పటికే పోలీసులు గుర్తించారు. ఈ నేపధ్యంలో ఆయా మాజీలపై తిరిగి షీట్‌లు తెరవాలని పోలీస్ అధికారులు భావిస్తున్నారు.


దహనం చేసిన ద్విచక్ర వాహనం

గుంటూరులో చాపకింద నీరులా

ఆధిపత్యం కోసం వరుస హత్యలు, హత్యాయత్నాలతో గుంటూరుని శాసించిన అనేక మంది రౌడీషీటర్లు కాలగర్భంలో కలిసిపోయారు. నగరంలో కొంత ప్రశాంత వాతావరణం నెలకొంటున్న తరుణంలో తిరిగి రౌడీ షీటర్లు రెచ్చిపోతున్నారు. ప్రధానంగా అరండల్‌పేట, లాలాపేట, పాతగుంటూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్ల కార్యకలాపాలు ఇటీవల కాలంలో పెరిగాయి. నగరంలో ఇద్దరు రౌడీషీటర్‌లపై పోలీసులు పీడీ యాక్ట్ పెట్టి ఏడాది పాటు జైలుకు పంపినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. మద్దిరాల గోపి, కుక్కల శివలు పీడీ యాక్ట్ గడువు ముగిసిన అనంతరం జైలు నుంచి విడుదలయ్యాక తిరిగి దందాలు, దాడులు సాగిస్తున్నారు. కళాకారులకాలనీ, రాజీవ్‌గాంధీ నగర్, సంజీవయ్యనగర్, శివనాగరాజు కాలనీ, శారదాకాలనీ, బొంగరాలబీడు తదితర ప్రాంతాల్లో గోపితో పాటు పలువురు రౌడీషీటర్ల హవా కొనసాగుతోంది. ఆంజనేయకాలనీలో ఓ ఇంటిపై దాడి, ఓ ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశాడు. ఒక హత్య కేసు కూడా గోపిపై లేనప్పటికీ పీడీ యాక్ట్ ప్రయోగించారంటే అతడి నేర స్వభావం ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. మద్యం, గంజాయి తాగాడంటే దారిన పోయే వారిని కొట్టి డబ్బు గుంజుకోవడం నిత్యకృత్యం. లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో కరుడుగట్టిన రౌడీషీటర్ కుక్కల శివ కూడా రౌడీ కార్యకలాపాల్లో చురుగ్గా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జైలు నుంచి విడుదలైన కుక్కల శివ ఇటీవల బార్ వద్ద ఓ వ్యక్తిపై దాడి చేశాడు. ఓ యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన రౌడీషీటర్ చింతగుంట్ల ప్రవీణ్ ప్రవీణ్ జైలులో రిమాండ్‌లో ఉన్నాడు. కొరిటెపాడుకు చెందిన కారసాని రమేష్ గత ఎన్నికలకు ముందు వరకు మంత్రి విడదల రజిని వెంట తిరుగుతూ రెచ్చిపోయాడు. ఇటీవల సంగడిగుంటలో యువకులు మధ్య జరిగిన కొట్లాటలో కారసాని రమేష్ దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లైన కావటి రాజేష్, నక్కల దుర్గాప్రసాద్ తదితరులు ఇటీవల పెదకాకాని పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటోనగర్లో లారీ అసోసియేషన్ వివాదంలో ఓ నాయకుడిపై దాడికి పాల్పడ్డారు. గతంలోనూ రాజేష్ కిరాయి హత్యకు పాల్పడిన కేసులో నిందితునిగా ఉన్నాడు. గతంలో కలపాల ప్రతాప్ అనే రౌడీషీటర్‌పై పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. గత ఎన్నికలకు ముందు రౌడీషీటర్ రమేష్‌ను దారుణంగా హత్య చేసిన కేసులో నిందితులైన ఆరిఫ్, మున్నా, బాషతో పాటు మరో ఇద్దరు రౌడీ షీటర్ల కార్యకలాపాలు సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గుజ్జనగుండ్లకు చెందిన రౌడీషీటర్ నడ్డి వంశీ అజ్ఞాతంలో ఉండి కార్యకలాపాలు సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గుజ్జనగుండ్లకు చెందిన రౌడీషీటర్ జాకీర్ ఇటీవల క్రోసూరుకు చెందిన రౌడీషీటర్ బాజి ఓ వేడుకకు రాగా డబ్బు డిమాండ్ చేస్తున్నాడనే కారణంతో హత్య చేశాడు. జాకీర్ కూడా ఆయా కార్యకలాపాల్లో చురుగ్గా ఉంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. స్వర్ణభారతినగర్‌కు చెందిన సిరిపురం బాజీ కూడా ఆ ప్రాంతంలో స్థల వివాదాలు, బెదిరింపులు వంటి కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

గతంలో అరండల్‌పేటలో జరిగిన రౌడీషీటర్ బసవల వాసు హత్య కేసులో నిందితులైన చెకోడీల సతీష్, బుడంపాడు రామకృష్ణ అలియాస్ ఆర్కే, కావటి రాజేష్‌తో పాటు మరికొందరు రౌడీషీటర్ల కార్యకలాపాలు పైకి కనిపించక పో యినా చాపకింద నీరులాగా సాగుతు న్నట్లు నిఘావర్గాలు గుర్తించాయి. సతీష్‌పై ఉన్న రౌడీషీట్‌ను ఫిరంగి పురం స్టేషన్‌కు బదిలీ చేయగా కార్యకలాపాలన్నీ పాతగుంటూరులో సాగుతున్నాయి. అరండల్‌పేట స్టేషన్ పరిధిలో రౌడీషీటర్‌గా ఉన్న తాడికొండకు చెందిన రౌడీషీటర్ నాగరాజు షీటును తాడికొండస్టేషన్‌కు బదిలీ చేసినా కార్యకలాపాలన్నీ అరండల్‌పేట పరిధిలోని సాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మంగళదాస్‌నగర్‌కు చెందిన సాయి చిల్లర గొడవలతో స్థానికంగా దౌర్జన్యాలు చేస్తునట్లు ఆరోపణలు ఉన్నాయి. తాడికొండలో మరో రౌడీషీటర్ రఫీ చురుగ్గా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో పొన్నూరులో ఏకంగా పోలీస్‌స్టేషన్ ముందే రెండు రౌడీ గ్రూపుల మధ్య జరిగిన కొట్లాట అప్పట్లో తీవ్ర కలకలం రేపింది. వైసీపీకి చెందిన రౌడీషీటర్లు, నాజర్, ఆయన తమ్ముడు జాఫ ర్‌కు, అంజుమన్ కమిటీ నాయ కుడు మాము గ్రూపుకు మధ్య గొడవలు ఉన్నా యి.

మంగళగిరిలో ఆధిపత్య పోరు

మంగళగిరిలో రౌడీషీటర్లు తోట శ్రీను, తాడిపోయిన మహేష్ వర్గాల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. గతంలో మహేష్ సోదరుడు ఉమాను తోట శీను మరికొందరు కలిసి హత్య చేశారు. ఇరువర్గాలు అదును కోసం ఎదురు చూస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇసుక దందా వ్యవహారంలో ఇటీవల ఓ వ్యక్తిపై రౌడీషీటర్ హరి అతడి అనుచరులు దాడి చేసిన ఘటన సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. రౌడీషీటర్ తొత్తుక సాయి స్థానికంగా పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు ప్రధాన అనుచరుడైన అబ్బరాజుపాలేనికి చెందిన రౌడీషీటర్ సరిగమల మహేష్ కూడా చురుకుగా ఉన్నాడు. కొద్దిరోజుల క్రితం రాజధాని ప్రాంతంలో ఎస్సీసీ కంపెనీకి చెందిన సెక్యూరిటీ ఫీల్డ్ ఆఫీసర్ బాలకృష్ణపై హత్యాయత్నం చేశాడు.

తెనాలిలో దాడి.. బైకు దహనం

తెనాలి అర్బన్: తెనాలిలో ఓ యువతిని హతమార్చిన రౌడీషీటర్ ఘైనం మరిచిపోకముందే మరో రౌడీషీటర్ రెచ్చిపోయాడు. ముక్కు ముఖం తెలియని యువకునిపై దాడి చేయడమే కాకుండా ద్విచక్ర వాహనాన్ని కూడా దహనం చేసే ప్రయత్నం చేశాడు. ఐతానగర్‌కు చెందిన రౌడీషీటర్ సముద్రాల పవన్ అలియాస్ లడ్డూ సోమవారం అర్ధరాత్రి మద్యం మత్తులో ఆ దారిన ద్విచక్ర వాహనంపై వెళుతున్న కాకుమాను ఇంద్రజిత్‌ను బండి ఆపమని కేకలు వేశాడు. తనను కాదనుకుని ఇంద్రజిత్ వెళ్లిపోగా మరో వాహనంపై లడ్డూ వెంటపడి దాడి చేసి తీవ్రంగా కొట్టాడు. ఆపై ఇంద్రజిత్ ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టాడు. గాయపడిన ఇంద్రజిత్ స్నేహితుల సాయంతో ఆసుపత్రిలో చేరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసిరౌడీషీటర్ కోసం గాలింపు చేపట్టారు. జిల్లా ప్రభుత్వవైద్యశాల్లో చికిత్స పొందుతున్న బాధితుడ్ని మంత్రి మనోహర్ పరామర్శించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తెనాలిలో అకారణంగా యువకుడు ఇంద్రజిత్‌పై రౌడీషీటర్ దాడిచేయడం బాధాకరమన్నారు.